


రామసముద్రం మండలం తిరుమలరెడ్డిగారిపల్లెలో విద్యుత్ కనెక్షన్ లేక తుప్పుపట్టిన బోరు

విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూపు

● 5,983 మంది రైతులు డబ్బులు చెల్లించారు..
● స్పేర్‌పార్ట్స్, కండక్టర్, సబ్‌స్టేషన్ల అవసరం
● రూ.15 కోట్ల బడ్జెట్ కోసం ఎస్పీడీసీఎల్ ప్రతిపాదనలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలకుల నిర్లక్ష్యం అన్నదాతలకు శాపంగా మారింది. రూ.కోట్లు పెట్టి బోర్లు డ్రిల్లింగ్ చేసుకున్న రైతులు, అదే తరహాల్లో ఉచిత విద్యుత్ కనెక్షన్ల కోసం రూ.కోట్లు చలానాల రూపంలో చెల్లించినా.. ఏడాది నుంచి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు కాలేక రైతులు ఆక్రందనలు చేస్తున్నారు. వేల హెక్టార్లలో భూములు బీడుగా పెట్టుకుని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సరిపడా విద్యుత్ సరఫరా చేయాలంటే జిల్లాలో 30 ఎంవీఏ స్థాయి సబ్‌స్టేషన్లు, వేల మీటర్ల విద్యుత్ తీగలు, క్రాస్ ఆర్మ్స్, ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలుకు ఎస్పీడీసీఎల్‌కు రూ.15కోట్ల బడ్జెట్ అవసరం. ఈ దిశగా అధికారులు ఎస్పీడీసీఎల్ కార్పొరేషన్‌కు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

ఎనిమిది నెలలుగా భూములు బీడు పెట్టాను..



సంవత్సరం ముందు బోరు తవ్వించాను, ఎనిమిది నెలల ముందు ట్రాన్స్‌ఫార్మర్ కోసం డబ్బులు కట్టాను. అప్పటి నుంచి కరెంటు కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నాను. అదో ఇదో అంటున్నారే కానీ, కరెంటు కనెక్షన్ ఇవ్వలేదు. బోరులో నీళ్లున్నా, భూమి బీడుగానే పెట్టాను. ఇప్పటికైనా అధికారులు కనికరించి కరెంటు కనెక్షన్ ఇస్తే, పంటలు పండించుకుంటా.

- చిన్నరెడ్డెప్ప, తిరుమలరెడ్డిగారిపల్లె, రామసముద్రం మండలం

రెండు నెలల్లో విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేస్తాం..

జిల్లాలో చలానాలు చెల్లించిన రైతులకు రెండు నెలల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తాం. వీటికి అవసరమైన మెటీరియల్ కోసం ఎస్టిమేషన్ వేసి పంపాము. స్టోర్స్‌కు మెటీరియల్ వచ్చిన వెంటనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తాం. రాయచోటి కేంద్రంలో ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. సాధ్యమైనంత వరకు జనవరి 20వ తేదీ రాష్ట్ర మంత్రిచే ఎస్పీడీసీఎల్ కార్యాలయం ప్రారంభించి రైతులకు, గృహ, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందిస్తాం.

- ఎస్.రమణ, ఎస్ఈ, ఎస్పీడీసీఎల్, కడప

ఏడాదిగా పేరుకుపోయిన కనెక్షన్లు

జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రాజంపేట, పీలేరు ఎస్పీడీసీఎల్ డివిజన్‌లు ఉన్నాయి. వీటిలో గత ఏడాది నుంచి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం చలానా రూపంలో డబ్బులు చెల్లించిన 5,983 మంది రైతులు ఉన్నారు. అప్పులు చేసి బోర్లు తవ్వుకున్న రైతులు, అదనపు అప్పులు చేసి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు చాలానాలు కూడా చెల్లించారు. ఒక్కో రైతు ఎంత లేదన్నా రూ.25 వేల నుంచి రూ.4 లక్షల వరకు ఎస్పీడీసీఎల్‌కు చలానాలు చెల్లించారు. కానీ ఇప్పటి వరకు వారికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు కాలేదు. అదేమంటే విద్యుత్ కనెక్షన్లకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, క్రాస్ ఆర్మ్స్, కండక్టర్లు (విద్యుత్ వైర్లు), ఇన్సులేటర్లు స్టోర్ నుంచి రావాలని విద్యుత్ అధికారులు రైతులతో అంటున్నారు. వీరిలో మదనపల్లె విద్యుత్ డివిజన్‌లోనే 3,060 మంది రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

దూరాభారంతో పెరుగుతున్న ఖర్చులు

రైతులు బోర్లకు అమర్చే సబ్‌మర్సిబుల్ మోటార్ కనీసం 15 హెచ్‌పీ కెపాసిటీ ఉంటుంది. ఈ స్థాయి మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ అవసరమైతే సుమారు రూ.25 వేలు ఎస్పీడీసీఎల్‌కు చెల్లించాలి. బోరు మోటార్‌కు సమీపంలోని ప్రధాన విద్యుత్ లైను మూడు పోల్స్ దూరంలో మాత్రమే దూరం ఉంటే 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, ఇన్సులేటర్, క్రాస్‌ఆర్మ్స్ ఎస్పీడీసీఎల్ ఉచితంగా ఇస్తుంది. అదే దూరాభారం పెరిగితే రైతులే ఈ అదనపు ఖర్చు భరించాల్సి వస్తుంది. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు, క్రాస్‌ఆర్మ్స్, ఇన్సులేటర్లు ఖర్చు కలిపి రైతులు ఎంత లేదన్నా రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు భరించాల్సి వస్తుంది.

వ్యవసాయ విద్యుత్‌కు పెరుగుతున్న భారం

జిల్లాలో ఇప్పటివరకు 1,36,108 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటికి ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో 141 సబ్‌స్టేషన్ల నుంచి 1,546.7 ఎంవీఏ స్థాయిలో ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఇది ఎస్పీడీసీఎల్, ప్రభుత్వంపై అధిక భారం పడుతోంది. ఈ క్రమంలో ఇప్పుడు జిల్లాలో 5,983 మంది కొత్త రైతుల బోర్లకు విద్యుత్ సరఫరా చేయాలంటే మరో 6 సబ్‌స్టేషన్లను అదనంగా నిర్మించాల్సి ఉంటుంది. ఈ సబ్‌స్టేషన్లు నిర్మించాలంటే ఎస్పీడీసీఎల్‌పై అదనంగా రూ.10 కోట్ల భారం పడుతుంది. ఇదిలా ఉంటే మూడు పోల్స్ దగ్గరలోనే బోరు ఉంటే అలాంటి రైతులకు ఎస్పీడీసీఎల్ ఉచితంగా 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలి. ఇలాంటి రైతులు 500 మంది వరకు ఉంటే వీరికి ఉచితంగా రూ.5 కోట్లు స్పేర్‌పార్ట్స్ బిగించాల్సి ఉంది. ఇది కూడా ఎస్పీడీసీఎల్‌పై భారం పడుతుంది.

వేరుపడిన ఎస్పీడీసీఎల్

కొత్త జిల్లాలు ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచిన తరువాత అటు కడప, ఇటు చిత్తూరు జిల్లాల నుంచి పురుడు పోసుకున్న జిల్లాలో నాలుగు ఎస్పీడీసీఎల్ డివిజన్‌లు ఏర్పడ్డాయి. రెండేళ్లుగా వీటి పరిపాలన అటు కడప, ఇటు తిరుపతి నుంచి సాగించాయి. దీంతో పర్యవేక్షణ, పాలన కష్టంగా మారడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నుంచే ఎస్పీడీసీఎల్ పరిపాలనకు నడుం బిగించారు. ఇందులో భాగంగా రాయచోటిలో ఎస్పీడీసీఎల్ కేంద్ర కార్యాలయం ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటి కొత్త కేంద్రానికి ఇప్పుడు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు తలకు మించిన భారంగా మారుతోంది. సుమారు రూ.15 కోట్లు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు, ఉచిత విద్యుత్ సరఫరాకు అవసరమవుతోంది. ఈ దిశగా ఎస్పీడీసీఎల్ అధికారులు కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులు ఎప్పుడు విడుదలవుతాయో, రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఎప్పుడు వస్తాయో అని ఆశగా ఎదురుచూస్తున్నారు.



ములకలచెరువు మండలం సోంపాళ్యం గ్రామంలో విద్యుత్ కనెక్షన్ లేని బోరు

అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా

● ఉమ్మడి కడప జిల్లా ప్రొహిబిషన్, ఎన్‌ఫోర్సుమెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.రవి

ముఖాముఖి



రైల్వేకోడూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో అక్రమ మద్యంపై ప్రత్యేక నిఘా ఉందని ఉమ్మడి కడప జిల్లా అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరిండెంట్ ఎం.రవి తెలిపారు. ఈ సందర్భంగా పలు విషయాలను ఆయన రైల్వేకోడూరుకు వచ్చిన సందర్భంగా ఆంధ్రజ్యోతికి వివరించారు.

ప్రశ్న: ఉమ్మడి కడప జిల్లాలో ఎన్ని సారా కేసులు నమోదు చేశారు?

జవాబు: ప్రస్తుతానికి నాటుసారాపై రెండు కేసులు నమోదు చేశాము. 9 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నాము. 250లీటర్ల సారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊటను ధ్వంసం చేశాము.

ప్రశ్న: ఇతర రాష్ట్రాల నుంచి మద్యం సరఫరా అవుతోందా?

జవాబు: ఇతర రాష్ట్రాల నుంచి మద్యంపై ప్రత్యేక నిఘా ఉంది. ఇప్పటికి ఒక్క కేసు నమోదు చేశాము. ఇందులో నలుగురిని అరెస్టు చేశాము. 34 లీటర్ల ఇతర రాష్ట్రాల మద్యం స్వాధీనం చేసుకున్నాము.

ప్రశ్న: బెల్టుషాపులపై నిఘా ఎలా ఉంది?

జవాబు: బెల్ట్ షాపులపై నిరంతరాయంగా నిఘా ఉంది. ఎక్కడా రాజీ లేకుండా దాడులు చేస్తున్నాము. ఇప్పటికి 18 కేసులు నమోదు చేసి, 18 మందిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపెట్టాము. ఎంతటి వారైనా బెల్ట్ షాపు నిర్వహిస్తే సహించేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: నల్లబెల్లం అమ్మకాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: నల్లబెల్లం అమ్మకాలపై ప్రతి జనరల్ స్టోర్‌కు వెళ్లి అమ్మకాలు చేయరాదని హెచ్చరించాము. ఎక్కువగా కావాలన్నా నల్లబెల్లం ఇవ్వరాదని హెచ్చరికలు చేశాము. తరచూ దీనిపై నిఘా పెట్టి ఉన్నాము.

ప్రశ్న: లోక్ అదాలత్‌లో ఎన్ని కేసులు పరిష్కారం అయ్యాయి

జవాబు: ఉమ్మడి కడప జిల్లాలో ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో 552 కేసులు పరిష్కారం అయ్యాయి.

ప్రశ్న: ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు సాగుతున్నాయా?

జవాబు: ప్రభుత్వం నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలి.



వంగ రైతుల
పంట పండింది
● తమిళనాడు మార్కెట్‌లో భారీ డిమాండ్ 6
● కేజీ రూ.30 నుంచి రూ.70కి పెరుగుదల

రహదారికి విముక్తి
● ప్రధాన గేటు, ఫెన్సింగ్‌ను తొలగించాలని ఆదేశం 6
● దశాబ్దాల ఆక్రమణలకు తెరదించిన కలెక్టరు శ్రీధర్

వెబ్‌ల్యాండ్ ఆధారాలతోనే రిజిస్ట్రేషన్లు

● రిజిస్ట్రేషన్లకు అడంగల్ ప్రామాణికం కాదు
● త్వరలో రాజముద్రతో కొత్త పాసుపుస్తకాలు : కలెక్టరు చామకూరి శ్రీధర్

కలికిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్లు వెబ్‌ల్యాండు, నిషేధిత జాబితాల ఆధారంగా జరగాలని, లేనిపోని వాటిని పరిశీలించాలని రైతులను ఎందుకు ఇబ్బంది పెడతారని కలెక్టరు చామకూరి శ్రీధర్ అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని పారపట్లలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలిసి కలెక్టరు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒక రైతు తన గోడు వెళ్లబోసుకున్నాడు. తన తాతల నుంచి వస్తున్న భూమికి పాసుపుస్తకంతో సహా అన్ని రికార్డులున్నా రిజిస్ట్రేషన్ చేయమంటే తిరస్కరిస్తున్నారని చెప్పాడు. 1బి, అడంగల్ తెమ్మన్నారని, అడంగల్‌లో దరఖాస్తు పట్టా అని పొరపాటు నమోదు కావడంతో రిజిస్ట్రేషన్ చేయడం లేదని వాపోయాడు. అక్కడే ఉన్న రిజిస్ట్రేషన్ అధికారులను పిలిచి వివరాలు అడిగారు. వారు కూడా అదే సమాధానం చెప్పారు. అడంగల్‌తో మీకు పనేమిటని రిజిస్ట్రేషన్‌కు చూడాల్సిందల్లా వెబ్‌ల్యాండ్, నిషేధిత జాబితాలు మాత్రమేనని స్పష్టం చేశారు. అనవసరంగా రైతులను వేధించడం మానుకోవాలని చెప్పారు.

60 ఎకరాలకు దొరికిన దారి

రెవెన్యూ సదస్సు పుణ్యమా అని పారపట్ల గ్రామంలో దశాబ్దాల కాలంగా 60 ఎకరాల పొలాలకు దారిలేకుండా పోయిన సమస్య పరిష్కారానికి కలెక్టరు చొరవ తీసుకున్న తీరు ప్రశంసనీయంగా నిలిచింది. పక్క రైతుల పట్టా భూముల నుంచి బలవంతంగా దారి ఏర్పరిచే అధికారం ఎవరికీ లేదని, అయితే రైతులు కూడా సహకరిస్తే దారి సుగమమవుతుందని సూచించారు. 60 ఎకరాల రైతులు అందరూ కలిసికట్టుగా రూ.5 లక్షలు పోగు చేసుకుంటే తన వంతుగా మరికొన్ని నిధులు జమ చేసి దారికి కావలసిన భూమి కొనిస్తానని హామీ ఇచ్చారు. ఈ పద్ధతిలో నెల రోజుల్లో పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ వారికి తెలిపారు. వెంటనే ప్రతిపాదనలు పంపాలని తహసీల్దారును ఆదేశించారు. మరోచోట ప్రభుత్వ రస్తా భూమిని ఆక్రమించి ఎవరూ వెళ్లకుండా పెద్ద గేటు అమర్చిన ఫిర్యాదుపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. వెంటనే జేసీబీ (ప్రొక్లైనర్) తెప్పించండి, తానే ముందుండి గేటు తొలగిస్తానని చెప్పారు. ఆ తరువాత ప్రతి పది నిమిషాలకు ఒకసారి జేసీబీ వచ్చిందా లేదా అంటూ వాకబు చేశారు. గ్రామాల్లో రెవెన్యూ వ్యవహారాలకు సంబంధించిన సమస్యలను సమూలంగా తుడిచేయడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. డీకేటీ భూములను అమ్ముకోవద్దని, ఎవరూ కొనుక్కోవద్దని, ఇది అన్ని విధాలా భవిష్యత్తులో నష్టదాయకమవుతుందని తెలిపారు.

రాజముద్రతో కొత్త పాసు పుస్తకాలు

ఎవరి ఫొటోలు లేకుండా పక్కా రాజముద్రతో కొత్త పాసు పుస్తకాలు రానున్నాయని, ఒకటి రెండు నెలల్లో రైతులకు అందజేస్తామని, అంతవరకూ వెబ్‌ల్యాండ్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. పారపట్లలో 2300 ఎకరాలున్నాయని, సమస్యలు కూడా అదే స్థాయిలో వచ్చాయని చెప్పారు. సదస్సులో ప్రత్యేక అధికారి జయప్రకాష్, ఎండోమెంట్ అధికారిణి మంజుల, సర్పంచు అరుణ, సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి, తహసీల్దారు మహేశ్వరీబాయి, మండల సర్వేయర్ రెడ్డెప్ప, సబ్ రిజిస్ట్రారు, అటవీ శాఖ ప్రతినిధులు, వీఆర్వోలు, సచివాలయాల ఉద్యోగులు హాజరయ్యారు.



రైతుల సమస్యలు వింటున్న కలెక్టరు శ్రీధర్, సబ్ కలెక్టరు మేఘస్వరూప్

భూములు కోల్పోయి రోడ్డున పడ్డాం

● వైసీపీ ప్రభుత్వ హయాంలో ముంచేశారు.. ● పనులు చేసినా నష్టపరిహారం ఇవ్వలేదు
● వ్యవసాయం లేక కూలీలుగా మిగిలాం.. ● కాలువలో దిగి రైతుల నిరసన
● గాలేరు-నగరిలో హంద్రీ-నీవా అనుసంధానం కాలువ బాధితుల ఆవేదన

ములకలచెరువు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూములు కోల్పోయి రోడ్డున పడ్డాం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన గాలేరు-నగరితో హంద్రీ-నీవా అనుసంధానం కాలువ పనులకు మా భూములు తీసుకున్నారు. పనులు చేపట్టారు గానీ వైసీపీ ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా నష్టపరిహారం ఇవ్వలేదు. మూడేళ్లుగా వ్యవసాయం లేక కూలీలుగా మారామని భూములు కోల్పోయిన రైతులు నిరసనకు దిగారు. ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ చుంచువారిపల్లె సమీపంలోని కాలువలో దిగి బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడు వెల్లబుచ్చారు. కడప జిల్లాలోని గండికోట జలాలను ఈ ప్రాంతానికి తీసుకొచ్చి తాగునీరు, సాగునీరు అందించేందుకు గత వైసీపీ ప్రభుత్వం 2021 జూలై 4వ తేదీ పనులు ప్రారంభించింది. గండికోట నుంచి గాలేరు-నగరి కాలువను తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యం, తంబళ్లపల్లె, ములకలచెరువు మండలాల మీదుగా పెద్దతిప్పసముద్రం మండలంలోని పులికల్లు వద్ద ఉన్న హంద్రీ-నీవా కాలువకు అనుసంధానం చేసేలా అప్పటి ప్రభుత్వం పనులకు శ్రీకారం చుట్టింది. అప్పట్లో పనులు చేసే సమయంలో నష్టపరిహారం ఇస్తామని చెప్పి పెద్దమండ్యం, తంబళ్లపల్లె, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల నుంచి వందలాది ఎకరాల భూమిని సేకరించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న మూడేళ్ల వరకు రైతులకు నష్టపరిహారం చెల్లించలేదు. కాలువ పనులు ఇష్టం వచ్చినట్లు చేసి ఎక్కడ పడితే అక్కడ రాళ్లు, మట్టి వేయడంతో రైతులు మిగిలిన భూమిలో కూడా వ్యవసాయం చేయలేకపోయారు. ఈ క్రమంలో బుధవారం తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె, ములకలచెరువు మండలం అడివినాయనిచెరువుపల్లె, సానేవారిపల్లె, గట్టుకిందపల్లె గ్రామాలకు చెందిన భూబాధితులు పనులు చేసిన కాలువ వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించకుండా మా భూముల్లో కాలువ పనులు చేపట్టిందన్నారు. మూడేళ్ల పాటు తమకు నష్టపరిహారం చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులు పెట్టిందన్నారు. తమ దగ్గర స్టాంపు పేపర్లలో సంతకాలు చేయించుకుని పనులు చేశారని, నష్టపరిహారం కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. పొలాల మధ్యలో కాలువ పనులు చేపట్టడంతో ఎక్కడ పడితే అక్కడ మట్టి, రాళ్లు తోలేశారని, దీంతో మూడేళ్లుగా వ్యవసాయం కూడా చేయలేకపోతున్నామన్నారు. దీంతో కుటుంబాలను పోషించుకనేందుకు వ్యవసాయ కూలీలుగా పనులకు వెళుతున్నామని వాపోయారు. ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబునాయుడు కూడా ములకలచెరువు మండలం అడివినాయనిచెరువుపల్లె వద్ద కాలువ పనులను పరిశీలించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకుని తమకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో రైతులు మనిగే ప్రసాద్, మహదేవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మల్‌రెడ్డి, ఉత్తమరెడ్డి, రామచంద్రారెడ్డి, పవన్, జనార్ధన్‌రెడ్డి, మల్లికార్జున, శివమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



కాలువలో నిలబడి నిరసన తెలుపుతున్న రైతులు

ఎకరా పొలం కాలువకు పోయింది..



మా కుటుంబానికి ఒకటిన్నర ఎకరా పొలం ఉంది. అందులో ఎకరా తీసుకుని కాలువ పనులు చేపట్టారు. అర ఎకరాలోనైనా వ్యవసాయం చేసుకుందామంటే అక్కడ కూడా పెద్దపాటి రాళ్లు, మట్టి పోశారు. నష్టపరిహారం ఇవ్వలేదు. దీంతో వ్యవసాయం చేయలేక కుటుంబాన్ని పోషించేందుకు ఇతర రైతుల వద్ద వ్యవసాయ కూలీగా పనికి వెళ్తున్నా. మా తండ్రి కూడా రెండు నెలల క్రితం చనిపోయాడు. కూటమి ప్రభుత్వమైనా నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- పవన్, అడివినాయనిచెరువుపల్లె, ములకలచెరువు మండలం

వ్యవసాయం వదిలి మూడేళ్లయింది..



మా భూమిలో కాలువ పనులు చేపట్టడంతో మూడేళ్లుగా వ్యవసాయం వదిలేశా. కాలువ తీయడంతో పాటు ఎక్కడ పడితే అక్కడ పెద్ద పెద్ద రాళ్లు, మట్టి వేశారు. కాలువతో పాటు ఎత్తిపోతల కోసం ఐదెకరాలు తీసుకున్నారు. చిల్లిగవ్వ కూడా నష్టపరిహారం ఇవ్వలేదు. వ్యవసాయం లేక కుటుంబాన్ని పోషించడం భారంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకుని మాకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

- రామచంద్రారెడ్డి, రైతు, సానేవారిపల్లె, ములకలచెరువు మండలం

గంగమ్మను త్వరలోనే కలుస్తా

● ఆమె ఆత్మవిశ్వాసం నన్నెంతగానో కదిలించింది ● మంత్రి నారా లోకేశ్ ట్వీట్

కొండాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంగమ్మను త్వరలోనే కలుస్తా.. ఆమె ఆత్మవిశ్వాసం నన్ను ఎంతగానో కదిలించింది అని మంత్రి నారాలోకేశ్ ట్వీట్ చేశారు. వివరాల్లోకెళ్తే..



Lokesh Nara @naralokesh · 4h
కడప జిల్లా, కొండాపురం మండలం, గండ్లూరుకి చెందిన గంగమ్మ బాడుగ ఆటో తోలుతూ, కుటుంబ సభ్యులను పోషిస్తూ ఆదర్శంగా నిలిచింది. గంగమ్మ పట్టుదల, ఆత్మ అవిశ్వాసం నన్నెంతగానో కదిలించింది. ఆమె కష్టాన్ని టీం నా దృష్టికి తెచ్చింది. త్వరలోనే నేను గంగమ్మను కలుస్తాను.

గంగమ్మను కలుస్తానని మంత్రి నారా లోకేష్ చేసిన ట్వీట్

కొండాపురం మండలం, గండ్లూరు ఎస్టీ కాలనీకి చెందిన పగిడాల గంగమ్మ అలియాస్ ఆటో గంగమ్మ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. తన భర్తకు అనారోగ్యం కావడంతో బాధ్యతలను భుజాన వేసుకొంది. అద్దెకు ఆటో తీసుకొని రోజుకు రూ.300 సంపాదిస్తూ తన భర్తను, పిల్లలను, తోబుట్టువులను, తల్లిదండ్రులను చూసుకుంటోంది. ఈమె పడుతున్న బాధలను గుర్తించిన ఆంధ్రజ్యోతి ఈ నెల 15న 'బతుకు భారమై.. ఆటో నడుపుతూ..' అన్న ప్రధాన శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. దీంతో అధికారులు పరుగున ఆమె నివసిస్తున్న ఇంటి వద్దకు వెళ్లి వివరాలను సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సోషల్ మీడియాలోనూ ఈ విషయం వైరల్ కావడంతో మంత్రి లోకేశ్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా బుధవారం స్పందించారు. 'గంగమ్మ బాడుగ ఆటో తోలుతూ, కుటుంబ సభ్యులను పోషిస్తూ ఆదర్శంగా నిలిచింది. ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం నన్నెంతగానో కదిలించింది. ఆమె కష్టాన్ని టీం నా దృష్టికి తెచ్చింది. త్వరలోనే నేను గంగమ్మను కలుస్తాను' అని మంత్రి ఆయన ట్వీట్ చేశారు.

మంత్రి లోకేశ్‌కు, ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు

మేం పడుతున్న బాధలను గతంలో ఎవరూ పట్టించుకోలేదు. మొదటిసారిగా మా ఇబ్బందులను ఉన్నది ఉన్నట్లుగా ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాశారు. ఆ వెంటనే అధికారులు, మీడియా వాళ్లు మా దగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చారు. మా కష్టాన్ని మంత్రి నారా లోకేశ్ సార్ దృష్టికి తీసుకెళ్లిన మీడియాకు కృతజ్ఞతలు. లోకేశ్ సార్ మా కష్టాలను చూసి చలించడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. మాలాంటి వాళ్లను గుర్తించినందుకు మేం ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటాం. మమ్మల్ని కలుస్తాననడం నిజంగా అదృష్టం. ఆయన వచ్చి మా కష్టాలు తీరిస్తే, నిజంగా మా జీవితంలో పండుగ రోజు.

- గంగమ్మ, గండ్లూరు ఎస్టీ కాలనీ, కొండాపురం



తన పిల్లలతో కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న గంగమ్మ

ఉరుసులో చట్టాన్ని ఉల్లంఘించరాదు

- పీస్ కమిటీ సమావేశంలో సబ్‌కలెక్టర్



మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లెటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలం కలిచెర్ల వద్ద మౌలా కా పహాడ్ ఉరుసు ఉత్సవాల నిర్వహణలో చట్టాన్ని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తారని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో కడప అమీన్‌పీర్ దర్గా (పెద్ద దర్గా) పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేనీ వర్గం వారు, కలిచెర్ల మౌలా కా పహాడ్ పీఠాధిపతి హైదరాబాద్‌కు చెందిన అన్సారుల్ హక్ వర్గాలకు చెందిన వారితో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్సారుల్ హక్ వర్గం ఈనెల 26,27,28 తేదీల్లో కలిచెర్లలో ఉరుసు ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారని కడప పెద్ద దర్గా పీఠాధిపతి వర్గం వారు ఆక్షేపించారు. ఈ దర్గాపై సర్వహక్కులు కలిగిన వారే ఉరుసు ఉత్సవాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. అన్సారుల్లాహక్ మాట్లాడుతూ తమ తాతముత్తాతల నుంచి ఈ దర్గాపై తమకు హక్కులు ఉన్నాయని తామే ఉరుసు నిర్వహిస్తామని చెప్పారు. దీనిపై సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఇరువర్గాలు వారి వద్ద ఉన్న దర్గా డాక్యుమెంట్స్ తీసుకురావాలని వాటిని పరిశీలించాకే ఎవరికైనా దర్గా ఉరుసు ఉత్సవాలకు అనుమతిస్తామని తెలిపారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్య మాట్లాడుతూ అనుమతి లేకుండా కలిచెర్ల ఉరుసు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై పోలీసు కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అంతవరకు కలిచెర్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించాలని ములకలచెరువు సీఐ కృష్ణప్ప, పెద్దమండ్యం ఎస్ఐలను ఆదేశించారు.

రెవెన్యూ సదస్సులో 'సైబర్ క్రైమ్ కాల్' కలకలం!

కలికిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పారపట్ల గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సుకు కలెక్టరు చామకూరి శ్రీధర్ హాజరు కానున్న నేపథ్యంలో సదస్సు వద్ద ఒక సైబర్ క్రైమ్‌కు సంబంధించిన కాల్ కలకలం రేపింది. కలెక్టరు రాక కోసం అంతా ఎదురు చూస్తున్నంతలోనే ఒక రెవెన్యూ అధికారికి వాట్సాప్ కాల్ వచ్చింది. మాట్లాడుతుండగానే ఆయనలో మొదలైన పలువురిలో ఆందోళన పెంచింది. జరిగిన సంభాషణ ఏమిటంటే.. మీ అబ్బాయి (పేరుతో సహా చెప్పాడు) డ్రగ్ కేసులో ఇరుక్కున్నాడు. నేను ఐజీ మాట్లాడుతున్నాను. వెంటనే రూ.50 వేలు పంపాలి. తరువాత మాట్లాడుతాను.. అని. ఆ వెంటనే ఆయన కాల్‌ను హోల్డ్‌లో వుంచి తన కుమారుడికి ఫోన్ చేసి ఎలా వున్నావని అడుగుతూ వచ్చిన కాల్ గురించి వివరిస్తే.. ఇవన్నీ మామూలే పట్టించుకోకండి. కాల్‌కు రెస్పాండ్ కాకండని సలహా ఇచ్చాడు. దీంతో ఆయన ఫోన్ కట్ చేసి అక్కడే వున్న కలికిరి పోలీస్ ఇన్‌స్పెక్టరు రెడ్డిశేఖర్ రెడ్డికి జరిగిన విషయం వివరించాడు. ఇవన్నీ సైబర్ క్రైమ్ వ్యవహారాలని, వీటి విషయంలో జాగ్రత్తగా వుండాలని సీఐ సూచించారు. ఎలాంటి లింకులకు కూడా స్పందించవద్దని చెప్పారు. తరువాత ఆ రెవెన్యూ అధికారి ఫోన్‌ను పరిశీలించగా +92 3352440457 నంబరు నుంచి వచ్చినట్లు గుర్తించారు. ఇది పాకిస్తాన్ నంబరుగా తేలింది. కాగా ఫోన్ చేసిన ఆగంతకుడి స్క్రీన్ షాట్ ఫోటోను తీసి గూగుల్‌లో వెతగ్గా ఇటీవలి కాలంలో ఈ ఆగంతకుడు చేసిన అనేక మోసాల గురించి ఫోటోలతో సహా బయటపడ్డాయి.



ఫోన్ చేసిన నిందితుడు ఇతనే..

బోరుమోటార్ పగులగొట్టి కేబుల్ వైరు చోరీ

నిమ్మనపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేబుల్ వైరు దొంగలు ఎతంటి సాహసానికైనా తెగిస్తున్నారు. మూష్టూరు పంచాయతీ యర్రప్పగారిపల్లికి చెందిన రైతు సహదేవ వ్యవసాయ బోరు మోటార్‌ను మూడు రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు పగుల గొట్టి 60మీటర్ల వైరు దొంగలించారు. అంతే కాకుండా 15రోజులుగా గ్రామంలోని వ్యవసాయ బోర్ల వద్ద వున్న స్టార్టర్‌లను, వైర్లను దొంగలించారు, రైతు మాట్లాడుతూ తన వ్యసాయ పొలంలో వరి పంట వేసేందుకు నారు విత్తేందుకు బోరు వద్దకు పోగా అప్పటికే బిగించిన బోరు మోటర్‌ను పగలగొట్టి వేరు చోరీచేశారన్నారు. గతంలో కూడా పలు మార్లు స్టార్టర్లు దొంగలించినట్లు వాపోయాడు. దీంతో బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి దొంగల పట్టుకొని తన కేబుల్ ఇప్పించాలని కోరారు.



బోరు మోటార్‌ను పగులగొట్టి కేబుల్ వేరు చేసిన దృశ్యం

వంగ రైతుల పంట పండింది

- పెరిగిన వంకాయల ధరలు
- తమిళనాడు మార్కెట్‌లో భారీ డిమాండ్
- కేజీ రూ.30 నుంచి రూ.70కి పెరుగుదల
- ధరలు ఇలాగే కొనసాగితే రైతులకు సిరులు
- ఆనందంలో వంగ రైతులు



మార్కెట్‌కు తరలించేందుకు సంచుల్లో నింపుతున్న కాయలు

ములకలచెరువు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వంగ రైతుల పంట పండింది. చెన్నై మార్కెట్‌లో వంకాయల ధరలు ఆకాశాన్నంటాయి. వారం రోజుల వరకు రూ.25 నుంచి రూ.30 వరకు పలికిన ధర ప్రస్తుతం ఏకంగా రూ.60 నుంచి రూ.70కి చేరాయి. వరుసగా వచ్చిన రెండు తుఫాన్ల కారణంగా కురిసిన భారీ వర్షాలకు తమిళనాడు రాష్ట్రంలో సాగైన వంకాయ పంటలు దెబ్బతిన్నాయి. అలాగే మన ప్రాంతంలో రైతులు టమోటా పంట భారీగా సాగు చేశారు. దీంతో వంగ సాగు భారీగా తగ్గిపోయింది. ఫలితంగా ధరలు పెరగడంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ధరలు ఇలాగే కొనసాగితే రైతులకు కాసుల వర్షం కురవనుంది. టమోటా ధరలు ఏడు నెలల పాటు ఆశాజనకంగా ఉండటంతో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో రికార్డు స్థాయిలో టమోటా పంట సాగైంది. ధరలు ఇలాగే ఉంటాయని భావించి అత్యధిక మంది రైతులు ఇతర పంటల వైపు ఆసక్తి చూపలేదు. దీంతో వంగ పంట సాగు భారీగా తగ్గిపోయింది. నియోజకవర్గంలో ప్రతిఏటా ఈ సమయంలో సుమారు వెయ్యి ఎకరాల వరకు వంగ పంట సాగయ్యేది. ప్రస్తుతం కేవలం వంద ఎకరాలకు పైగా వంగ పంట సాగై దిగుబడి వస్తోంది. ఎకరా వంగ పంట సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.80 లక్షల వరకు ఖర్చు వస్తోంది. ఇక్కడ పండే వంకాయలకు తమిళనాడు రాష్ట్రంలో డిమాండ్ ఉంటుంది. ఈ ప్రాంతంలో పండిన వంకాయలను వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసి చెన్నై మార్కెట్‌కు తరలిస్తారు. అలాగే పలువురు రైతులు పండిచిన వంకాయలను స్వయంగా వారే చెన్నైకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. ఇక్కడి వంకాయలకు డిమాండ్ ఉంటే తమిళనాడు రాష్ట్రంలో ఈనెలలో వరుసగా వచ్చిన రెండు తుఫాన్ల కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. దీంతో అక్కడ సాగైన వంగ పంట పూర్తిగా దెబ్బతింది. ఫలితంగా ధరలు భారీగా పెరగడానికి కారణమైంది. దీంతో రెండు రోజుల క్రితం చెన్నై మార్కెట్‌లో ఉజాల రకం వంకాయలు కేజీ రూ.60 నుంచి 70 వరకు పలికాయి. అలాగే రెండో రకం వంకాయలు రూ.50 వరకు పలికాయి. ములకలచెరువు మండలం పాత గూడుపల్లెకు చెందిన రైతులు రాజారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు ఉజాల రకం వంకాయలను చెన్నై మార్కెట్‌కు తరలించగా కేజీ రూ.70 పలికింది.



చెట్లలోని వంకాయలు



ములకలచెరువు మండలం చెరువుకిందపల్లె సమీపంలో సాగైన వంకాయ తోట

పది ఎకరాల్లో వంగ సాగు చేశా

- ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వంగ రైతు, పాత గూడుపల్లె



పది ఎకరాల్లో ఉజాల వంగ పంట సాగు చేశాను. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం ఏడు ఎకరాల్లో వంకాయలు దిగుబడి వస్తున్నాయి. వారం రోజుల వరకు కేజీ రూ.30 వరకు పలికిన ధర ఒక్కసారిగా పెరిగిపోయింది. కోత విధించి నాలుగు టన్నుల కాయలను సోమవారం సాయంత్రం చెన్నై మార్కెట్‌కు తరలించాను. అక్కడ కేజీ రూ.70 చొప్పున పలికింది.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు కోడూరు విద్యార్థి

రైల్వేకోడూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎస్వీ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థి మోసిన అరవింద్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయుడు పుల్లారావు తెలిపారు. ఈ నెల 14 నుంచి 17 వరకు గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అరవింద్ ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. జనవరి 13, 14 తేదీల్లో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఆ విద్యార్థిని కళాశాల డైరెక్టర్ వసుంధర, అధ్యాపక బృందం తదితరులు అభినందించారు.



విద్యార్థి అరవింద్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్లు జైలుశిక్ష

సిద్దవటం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తమిళనాడు రాష్ట్రానికి చెందిన పొన్నాప్ పళని అనే వ్యక్తికి ఐదేళ్ల జైలు, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ ఓబులేశు తెలిపారు. 2018 అక్టోబరు 15న సిద్దవటం బీట్‌లోని చంచల చెలమ వద్ద ఎర్రచందనం దుంగలు స్మగ్లింగ్ చేస్తుండగా అప్పటి ఫారెస్ట్ రేంజి అధికారి ప్రసాద్ అతనిని అరెస్ట్ చేసి తిరుపతి రెడ్‌శాండిల్ అడిషనల్ సెషన్స్ కోర్టులో హాజరు పరచగా పై శిక్ష విధిస్తూ బుధవారం జడ్జి తీర్పు ఇచ్చినట్లు వివరించారు.

ఎస్పీడీసీఎల్‌కు రూ.9కోట్ల బకాయిలు

- చేతులు మారిన మిల్లు భూములు
- రికవరీ సాధ్యమేనా..?

మదనపల్లెటౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు అంటేనే 40ఏళ్లకూ పైగా పేరుగాంచింది. అలాంటి స్పిన్నింగ్ మిల్లు లాకౌట్ అయ్యి మూతపడి, కార్మికులు చెల్లాచెదురయ్యారు. ఇపుడు ఈ మిల్లు భూములు బహిరంగ వేలంలో కొన్న వ్యక్తులు, చేతులు మార్చేశారని సమచారం. ఈ మిల్లు నుంచి కార్మికులకు రావాల్సిన బకాయిలు కోర్టుల చుట్టూ తిరిగి వసూలు చేసుకుంటున్నారు. ఫ్యాక్టరీలకు రావాల్సిన బకాయిలు మిల్లును కొనుగోలు చేసిన వారి నుంచి రాబట్టేశారు. కాకపోతే పదేళ్లుగా ఎస్పీడీసీఎల్‌కు స్పిన్నింగ్ మిల్లు నుంచి రావాల్సిన బకాయిల విషయమై అధికారులు ఆలస్యంగా కళ్లు తెరిచారు. ఇప్పుడు ఇక్కడ చూస్తే మిల్లు భవనాలు నేటమట్టం కాక, కేవలం భూములు మాత్రమే వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. దీంతో ఎస్పీడీసీఎల్ అధికారులు హడావుడిగా అక్కడి చేరుకుని నోటీసు బోర్డులు పెట్టారు. బుధవారం మదనపల్లె ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర్ ఆధ్వర్యంలో సీటీఎం సమీపంలోని ఎంఎస్ఎం స్పిన్నింగ్ మిల్లు స్థలం వద్ద బోర్డు నాటారు. మిల్లు హెచ్‌టీ కనెక్షన్ మీటర్ నెంబర్ 235 నుంచి రూ.9,08,37,044 బకాయిలు రావాలని నోటీసుబోర్డులో వుంచారు. ఈ బకాయిలు చెల్లించకుంటే ఆస్తులను రికవరీ చేస్తామని, వడ్డీతో సహా ఈ బకాయిలు చెల్లించాలని నోటీసు బోర్డులో వుంచారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ డీఈ సురేంద్రనాయక్ ఏఈ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఎస్ఎం మిల్లు స్థలం ఎదుట నోటీసు బోర్డు ఏర్పాటు చేసిన మదనపల్లె ఎస్పీడీసీఎల్ అధికారులు

వైద్య కళాశాలల నుంచి భారీగా బదిలీలు

- మదనపల్లె, పులివెందుల మెడికల్ కళాశాలల నుంచి ఇతర కళాశాలలకు బదిలీ
- సర్దుబాటు పేరుతో రాష్ట్రంలోని పలు కళాశాలలకు కేటాయింపు

కలికిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె, పులివెందుల వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, అసొసియేటెడ్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను భారీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. ఫేస్-2లో చేపట్టిన ఈ రెండు మెడికల్ కళాశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానందున ఈ ఏడాది అడ్మిషన్లకు మెడికల్ కౌన్సిల్ ఆమోదం తెలపని నేపథ్యంలో ఇక్కడున్న బోధనాపరమైన అధ్యాపకులను ఫేస్-1తో సహా ఇతర పాత కళాశాలల్లో సర్దుబాటు విధానంలో బదిలీ చేసిం ది. మదనపల్లె నుంచి 34 మందిని, పులివెందు ల నుంచి 29 మందిని సర్దుబాటు పేరుతో రాష్ట్రంలోని పలు కళాశాలలకు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధానంతో మొత్తం 121 మందిని బదిలీ చేశారు. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మంగళవారం రెండు వేర్వేరు జీఓలు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు..


రస్తా పోరంబోకు రహదారికి విముక్తి

- దశాబ్దాల ఆక్రమణలకు తెర



రాతి కూసాలు, ముళ్ల కంచెను తొలగిస్తున్న దృశ్యం

కలికిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓ ఆసామి తన భూముల రక్షణకు భారీ గేట్లతో ముఖద్వారం, భూముల చుట్టూ వందలాది రాతి కూసాలతో ముళ్ల కంచె. లోపల ఇల్లు. అన్నీ బాగానే ఉన్నాయి. అయితే అందులో ప్రధానంగా వందలాది మంది రైతులకు ఉపయోగపడాల్సిన పెద్ద రస్తా పోరంబోకు రహదారి కూడా చిక్కుకుపోయింది. అటువైపు వెళ్లాల్సిన రైతులకు ప్రతిబంధకంగా మారింది. దశాబ్దాలుగా ఈ రహదారిని విడిపించుకుని వినియోగించుకోవాలని ప్రయత్నిస్తున్న వారి ఆశలు మాత్రం నెరవేరడం లేదు. అయితే బుధవారం మండలంలోని పారపట్ల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సు ఈ అతి పెద్ద అవాంతరానికి పరిష్కారం చూపించింది. ఈ నేపథ్యంలో తమ గ్రామంలోని సబ్ స్టేషన్ అనుకుని రస్తా పోరంబోకు ఉందని, అటు వైపు వందల ఎకరాలకు వెళ్లాల్సిన రైతులు దాని గుండా వెళ్లకుండా ఓ ఆసామి ఆక్రమించి చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు చేశారని కొంతమంది రైతులు బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టరు శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరు సర్వేయర్లను, రెవెన్యూ అధికారులతో చర్చించి పూర్వాపరాలు విచారించారు. రస్తా పోరంబోకు రహదారికి పెద్ద గేటు అమర్చిన విషయం వాస్తవమని తేలింది. వెంటనే జేసీబీ ఏర్పాటు చేయాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. తాను వెళ్లేలోగా గేటును దాంతో పాటు ముళ్లకంచెను తొలగించాలని తెలిపారు. సదస్సు ముగిసిన అనంతరం కలెక్టరు సబ్ కలెక్టరును వెంటబెట్టుకుని అక్కడికి మూడు కి.మీ దూరంలో ఉన్న రస్తా పోరంబోకు రహదారి వద్దకు చేరుకున్నారు. గేటు పెట్టిన రహదారిని బంద్ చేసిన మహబూబ్ బాషాను పిలిపించారు. ఇలా చేయడం ఏంటని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గేటును కూలగొట్టాలని ఆదేశించారు. అయితే ఒక్కో గేటు 400 కిలోలున్నాయని, ఒక్కరోజు గడువిస్తే తానే తొలగించేస్తానని అతను కలెక్టరును బతిమలాడాడు. రేపటిలోగా ముళ్లకంచెను కూడా తొలగిస్తామని తహసీల్దారు మహేశ్వరీబాయి చెప్పారు. గేటు తొలగించేందుకు ఒకరోజు గడువిస్తూ ముళ్లకంచెను మాత్రం వెంటనే తొలగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆ తరువాత రెండు గంటల్లోగానే తహసీల్దారు ముళ్ల కంచెను ప్రొక్లైనర్‌తో పూర్తిగా నేలమట్టం చేయించారు. ఎట్టకేలకు రస్తా పోరంబోకు రహదారికి విముక్తి లభించింది. సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని సునిశితంగా పరిశీలించి అప్పటికప్పుడే పరిష్కరించిన కలెక్టరు ప్రశంసలు అందుకున్నారు.



చలమారెడ్డిపల్లె కొండల్లో కమ్ముకున్న పొగమంచు

మంచుకురిసే వేళలో...

జిల్లాలో పొగమంచు కమ్ముకుంటోంది. రోజురోజుకు చలి తీవ్రత పెరగడంతో పిల్లలు, వృద్ధులు వణికిపోతున్నారు. ఉదయం 8 గంటలవుతున్నా పొగమంచు తగ్గక పోవడంతో ఇంట్లో నుంచి బయటకు రావడం లేదు. ఇక బుధవారం కడప నగరంలో పొగమంచు తీవ్రత ఎక్కువైంది. కొన్నిచోట్ల చలిమంటలు వేసుకొని సేద తీరే దృశ్యాలు కనిపించాయి. ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీల్లో వెళ్లే వారు పట్టపగలే లైట్లు వేసుకొనే పరిస్థితి కనిపించింది. చలికి నోరులేని పక్షులు అల్లాడిపోయాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప





చలికి వణుకుతున్న పక్షులు



కడప నుంచి రాయచోటికి వెళ్లే రోడ్డులో ఫ్లైఓవర్ వద్ద ఉన్న మంచు



చలిమంటల కౌగిలిలో వృద్ధులు

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం : జేసీ



రైతుల సమస్యలను వింటున్న జేసీ అదితిసింగ్

ఎర్రగుంట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి టు వేంపల్లె జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూమి కోల్పోతున్న రైతులందరికీ నిబంధనల ప్రకారం పరిహారం అందించి న్యాయం చేస్తామని జాయింట్ కలెక్టర్ అధితిసింగ్ తెలిపారు. బుధవారం ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో భూములు కోల్పోతున్న ఐదు గ్రామాల రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా రైతులు తమ అభ్యంతరాలను, సమస్యలను వివరించారు. మార్కెట్ రేటు ప్రకారం భూమి విలువ రూ.కోట్లలో ఉందని.. ప్రభుత్వం తమకిచ్చేది చాలా తక్కువగా ఉందన్నారు. ప్రొద్దుటూరు రోడ్డులో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూముల ధర సెంటు రూ.3 లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఉందని.. ప్రభుత్వం కేవలం ఎకరాకు 15 లక్షలు మాత్రమే ఇస్తామనడం అన్యాయం అన్నారు. దీనిపై పునరాలోచించి తమకు న్యాయం చేయాలని వారు జేసీని కోరారు. పెద్దనపాడులో రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, కలాలు తీసుకుంటున్నారని వాటికి తగ్గట్టుగా పరిహారం ఇవ్వాలని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, తహసీల్దార్ శోభన్ బాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.3 కోట్ల పరిహారం ఇప్పించండి

వేంపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో గతంలో రోడ్డు వెడల్పునకు అప్పటి ప్రభుత్వం ఎకరాకు రూ.6కోట్ల పరిహారం ఇచ్చింది.. ప్రస్తుతం ఊరిబయట వెళ్తున్న చాగలమర్రి-రాయచోటి రోడ్డుకు ఎకరాకు రూ.3కోట్లు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ అధితిసింగ్‌కు రైతులు, టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. వేంపల్లె మండల పరిషత్ సభాభవనంలో బుధవారం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో భూములు, స్థలాలు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.16లక్షలు ఉందని, సాధ్యమైనంత వరకు నిబంధనల మేరకు పెంచి పరిహారం ఇస్తామని తెలిపారు. దీనిపై టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరి రైతులకు మేలు చేయాలని కోరారు. ఆర్డీఓ చిన్నయ్య, ఎన్‌హెచ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో రైతులతో సమావేశం

వీరపునాయునిపల్లె, డిసెంబరు 18: ఎన్‌హెచ్-440 చాగలమర్రి టు వేంపల్లె జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూమి కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. బుధవారం స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో రైతులకు సమావేశం అయ్యారు. రహదారిలో భూమిపోయిన ఉరుటూరు, కీర్తిపల్లె, అయ్యవారిపల్లె, లింగాల, గంగిరెడ్డిపల్లె,తంగేడుపల్లె గ్రామాల రైతులతో మాట్లాడారు. భూమి పోయిన రైతులకు వ్యవసాయ భూమికైతే రూ.5.82లక్షలు రోడ్డు సైడ్ భూమికి అయితే రూ.11.90 లక్షలు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీంతో ప్రభుత్వం ఇస్తామంటున్న భూనష్టపరిహారానికి ఎవరికీ ఇష్టం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ లక్ష్మీదేవి, సీఐ చల్లని దొర, ఎస్‌ఐలు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పట్టించుకోకపోవడం దారుణం



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సుంకర రవి

కడప నాగరాజుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొవిడ్-19లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు పణంగా పెట్టి పనిచేసిన పారిశుధ్య కార్మికులను అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నగర కమిటీ అధ్యక్షుడు సుంకర రవి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట కొవిడ్-19, అడిషనల్ కార్మికుల పెండింగ్ వేతనాల కోసం చేస్తున్న నిరసన మూడవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మూడు రోజులుగా ఆందోళన చేస్తున్న అధికారులకు వినిపించడం లేదన్నారు. ఇకపై స్పందించకుంటే ఈనెల 23న జరిగే జనరల్ బాడీ మీటింగ్‌ను అడ్డుకుంటామన్నారు. అన్ని రంగాల పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. వెంటనే జీఓ 7 ప్రకారం వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంచుపాట తిరుపాల్, కార్యవర్గ సభ్యులు ప్రకాష్, సుంకర కిరణ్‌కుమార్, వడ్లపల్లె శ్రీధర్‌బాబు, కార్మికులు పాల్గొన్నారు.

మైలవరం జలాశయంలో మృతదేహం లభ్యం



వెంకటేష్ (ఫైల్ ఫొటో)

మైలవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయంలో బుధవారం ఊసుగాండ్ల పెద్ద వెంకటేష్ (40) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన పెద్ద వెంకటేష్ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళుతున్నానని భార్యకు చెప్పి వెళ్లాడు. ఎంత వెతికినా దొరకకపోవడంతో జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో వెంకటేష్ భార్య సుమలత ఫిర్యాదు చేసింది. జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం వెంకటేష్ మృతదేహం లభ్యం కావడంతో జమ్మలమడుగు అర్బన్ పోలీసులకు అప్పజెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి



జమ్మలమడుగు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడే నారాయణనాయక్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని బొమ్మేపల్లె తాండాకు చెందిన నారాయణనాయక్ (35) జమ్మలమడుగు నుంచి ద్విచక్ర వాహనంలో ముద్దనూరు రోడ్డులో వెళుతుండగా రోజా టవర్ ఎదురుగా స్కూలు బస్సును ఓవర్‌టేక్ చేస్తూ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఢీకొని వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో అతనికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా దారిలో మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులుపరిశీలించి కేసు నమోదు చేశారు.

కూతురు కనిపించలేదంటూ ఫిర్యాదు

చెన్నూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె సునంద (26) కనిపించడం లేదంటూ చెన్నూరు అరుంధతీనగర్‌కు చెందిన ఓబులేసు స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. సునంద ఇడుపులపాయి ట్రిబుల్ ఐటీలో సర్టిఫికెట్లు తెచ్చుకునేందుకు ఈనెల 5న వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా.. పని కాలేదని.. పని పూర్తి చేసుకుని వస్తానని సమాచారం ఇచ్చింది. ఆ తరువాత ఫోను స్విచ్ఛాఫ్ కావడంతో ఎక్కడికి వెళ్లిందో అర్థం కావడం లేదని.. పోలీసులు విచారించి తమ కుమార్తె ఆచూకీ తెలపాలంటూ సునంద తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



కోడూరు-రెడ్డివారిపల్లె తాత్కాలిక మార్గం దుస్థితి, కోడూరు-గుర్రప్పపాళెం గిరిజన కాలనీ మార్గంలో వెళ్లలేని స్థితి, తూర్పుపల్లె-పిట్టావాండ్లపల్లె మార్గం బంద్ అయిన దృశ్యం

మూడు గ్రామాలకు రాకపోకలు బంద్

- భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు
- పాడైన రహదారులను పునరుద్ధరించక..
- మళ్లీ వాన గండం... ఆందోళనలో పల్లె ప్రజలు

రైల్వేకోడూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) రైల్వేకోడూరులో గత సెప్టెంబరు నుంచి పలు దఫాలుగా కురిసిన భారీ వర్షాలకు చాలా గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి పల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కోడూరు-రెడ్డివారిపల్లె, తూర్పుపల్లె-పిట్టావాండ్లపల్లె, కోడూరు-గుర్రప్పపాళెం గ్రామాలకు సుమారు 25 రోజులుగా రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ఆ గ్రామాల ప్రజలు వేరే మార్గాల ద్వారా ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి రైల్వేకోడూరుకు చేరుకుంటున్నారు. రెడ్డివారిపల్లె నుంచి పాడి రైతులు పాలు తీసుకుని రైల్వేకోడూరుకు రావాలంటే రాను పోను సుమారు 10 కిలో మీటర్ల దూరం చుట్టూ తిరిగి చేరుకుంటున్నారు. బ్రిడ్జి నిర్మాణంలో ఉండడం.. తాత్కాలిక రోడ్డు వర్షాలకు ప్రతిసారి కొట్టుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా గుర్రప్పపాళెం గిరిజనులు రెడ్డివారిపల్లె మీదుగా పాటిమీదిపాళెం వచ్చి అక్కడి నుంచి చిట్వేలి రోడ్డుకు చేరుకుని రైల్వేకోడూరుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా తూర్పుపల్లె నుంచి పిట్టావాండ్లపల్లె వెళ్లేదారిలో రెండు నదులు ఉండడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. నీటి ఒరవడి ఎక్కువగా ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాడి రైతులు పాలు తీసుకుని రైల్వేకోడూరుకు రావాలంటే ఎక్కువ సమయం పట్టడమే కాకుండా చాలా దూరం వస్తుందంటున్నారు. అరటి రైతులు కాయలను ఎగుమతి చేసుకోవాలంటే నానా అవస్థలు పడుతున్నారు. ఇక విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలకు వెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. స్కూల్ వ్యాన్లు కూడా ఆయా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. అలాగే రైల్వేకోడూరు నుంచి పై గ్రామాలకు ఎవరైనా వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. ఇక బుధవారం నుంచి వర్ష సూచన ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేసి బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాడి రైతుల కష్టాలు వర్ణనాతీతం



కోడూరు-రెడ్డివారిపాలెం మధ్య 20 రోజుల నుంచి రోడ్డు సౌకర్యం లేక సంబంధాలు తెగిపోయాయి. దీంతో ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాడి రైతులు రైల్వేకోడూరుకు పాలు తీసుకెళ్లాలంటే.. నానా అవస్థలు పడుతున్నారు. వేరే మార్గాల ద్వారా చాలా దూరం తిరిగి అనేక వ్యయ ప్రయాలతో ప్రతి రోజు పట్టణానికి చేరుకోవాల్సి వస్తోంది.

-శ్రీకారపు మస్తాన్, రెడ్డివారిపల్లె

అరటి కాయలను తీసుకెళ్లాలంటే..



రెడ్డివారిపల్లె, తూర్పుపల్లె నుంచి పిట్టావాండ్లపల్లె వరకు, గుర్రప్పపాళెం గిరిజనుల ప్రాంతాల్లో అరటి తోటలు ఎక్కువగా సాగులో ఉన్నాయి. రోడ్లు సక్రమంగా లేకపోవడంతో అరటి కాయలను ఆ గ్రామాల నుంచి తీసుకెళ్లాలంటే కష్టంగా ఉంది. ప్రత్యామాయ మార్గాలు సక్రమంగా లేకపోవడంతో లారీలు తోటల్లోకి వెళ్లలేకపోతున్నాయి. దీంతో ఎగుమతులు నిలిచిపోయి రైతులు నష్టపోతున్నారు.

-దేశు క్రిష్ణారెడ్డి, అరటి వ్యాపారి, అనంతరాజుపేట

న్యాయవ్యవస్థను ప్రజలకు దూరం చేయడం తగదు

- ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు

కడప రూరల్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కక్షిదారుల వివాదాలను సత్వరం పరిష్కరించడానికి న్యాయవ్యవస్థను ప్రజల ముగ్గిట్లోకి తీసుకురావాల్సిన పాలకులు ప్రజలకు దూరం చేయడం సరికాదని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్పనాయుడులు పేర్కొన్నారు. తిరుపతిలో ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట చేపడుతున్న రిలే నిరాహారదీక్షలు బుధవారానికి 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలో కాకుండా తిరుపతిలో విచారణ చేపట్టేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 145ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 145 పున్యమా అని రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లా కేంద్రాలలో ఉన్న ఫస్ట్ ఏడీజే కోర్టులలో ఇప్పటి వరకు జరుగుతున్న ఎన్‌డీపీ ఎస్ యాక్టుకు సంబంధించిన కేసులన్నీ జిల్లా కేంద్రాలలో జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే దేశంలో 5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని సత్వర పరిష్కారం చేయడానికి మండల స్థాయి వరకు న్యాయస్థానాలను తీసుకొని వెళ్లి ప్రజలకు సత్వర న్యాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. దీక్షలకు సీపీఎం, ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకులతో పాటు బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, నందలూరు బార్‌అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జామవా, జింకా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలవండి

- సమగ్ర శిక్ష రాష్ట్ర సహిత విద్య సహాయ కోఆర్డినేటర్ అధికారి కల్పన శైల



మాట్లాడుతున్న రాష్ట్ర కోఆర్డినేటర్ కల్పన శైల

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న సౌకర్యాలను సక్రమంగా అందేలా చూడాలని సమగ్రశిక్ష రాష్ట్ర సహిత విద్య సహాయ కోఆర్డినేటర్ అధికారి కల్పన శైల మండల విద్యాశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం కడప నగర శివారులోని గీతం కళాశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల అవసరాలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు విచ్చేసి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బడి బయటఉండే విద్యార్థులందరిని బడిలో చేర్పించాలని, ప్రతి దివ్యాంగునికి ప్రభుత్వం కల్పించే ప్రతి సౌకర్య అందేలా చూడాలని కోరారు. ఇటీవలే భవిత విద్యార్థులకి ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, అలవెన్స్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. ఒక్క దివ్యాంగున్ని గుర్తించి వారికి సదరం సర్టిఫికెట్ ఇప్పించడంతో పాటు, వారి ప్రగతికి అవసరమైన విద్యా బోధన, ఉపకరణాలు, ఆరోగ్య సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. బడి బయట పిల్లలు అందరు బడిలో ఉండేటట్లు చూడాలని, అందరికి విద్య అందాలని తెలియజేశారు. కార్యక్రమానికి రిమ్స్ సూపరింటెండెంట్ సైక్రియాస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వెంకటరాముడు, క్లినికల్ సైకలాజిస్ట్ లక్ష్మీనారాయణ, అర్లీ చైల్డ్ ఇంటర్వెన్షన్ సెంటర్ డాక్టర్ ఫకృద్దీన్, సదరం సర్టిఫికెట్ విభాగాధిపతి నాగయ్యతో పాటు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ బ్రహ్మయ్య హాజరై వివిధ విభాగాలకు సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కడప ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి, ఏడీ కృష్ణకిషోర్, సహిత విద్య సమన్వయకర్తలు కేశవరెడ్డి, రమణమూర్తి, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో మరింత ప్రగతి సాధించాలి



మాట్లాడుతున్న ఆలపాటి శివయ్య

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం నాణ్యత ప్రమాణాలతో ఉన్నత పనితీరును కనబర్చినప్పటికీ మరింత ప్రగతి దిశగా వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ) ప్రతినిధి హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సీఈఓ ఆలపాటి శివయ్య స్పష్టం చేశారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ఐఎస్ఓ ప్రతినిధుల బృందం రెండు రోజుల సందర్శన పూర్తయింది. అనంతరం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కుల సచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి అన్ని శాఖల అధిపతులతో సమావేశమయ్యారు. సీఈఓ శివయ్య మాట్లాడుతూ సమగ్ర పరిశీలనలో బృందం దృష్టికి వచ్చిన పలు అంశాలను ప్రస్తావించారు. బోధన, పరిశోధనలు, పరిసరాలు నాణ్యమైనవిగా ఉన్నాయని తెలిపారు. శాఖల వారీగా ఐదు వరకు గ్రేడులు ఇచ్చారు. అక్కడక్కడ రికార్డుల నిర్వహణ మెరుగుకావాల్సి ఉందన్నారు. ప్రతి డాక్యుమెంట్‌కు సంబంధించిన ఆధారం ఫైలింగ్ చేయాలని తెలిపారు. అన్ని శాఖలు బాగా పనిచేస్తున్నాయని ప్రశంసిస్తూనే మరింతగా పనిచేస్తే ఉన్నతమైన న్యాక్ గ్రేడ్‌ను వైవీ యూ సొంతం చేసుకుంటుందన్నారు. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ ఆడిట్ సుమాదేవి మాట్లాడుతూ వైవీయూ అభివృద్ధికి మెరుగైన సూచనలు చేశారు. ఉపకులపతి ఆచార్య కెకృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడారు. ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ ఎల్ సుబ్రమణ్యశర్మ, ఐక్యూఏసీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుభాష్‌చంద్ర, సభ్యులు, అన్ని శాఖల అధిపతులు పాల్గొన్నారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం.. ఇరువురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వద్ద అధికారులు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో అక్రమంగా నిల్వ చేసిన 9550 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు...

బుధవారం బొమ్మవరం గ్రామానికి వెళ్లే మార్గంలో ఆటోలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు అనంతరాజుపేట పంచాయతీ పరిధిలోని ఓ ఇంట్లో అక్రమంగా నిలువ ఉన్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని చంద్ర అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సివిల్ సప్లయిస్ అధికారులు రాంమోహన్, ఆర్.లక్ష్మీదేవి, వీఆర్‌వో సృజిని, పోలీసులు సుధాకర్ రాజు, బాబుల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్.. తప్పిన ప్రమాదం

కడప(క్రైం), డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రవీంద్రనగర్‌లో బుధవారం రాత్రి ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. రవీంద్రనగర్‌కు చెందిన నందిని భర్త బుధవారం సాయంత్రం అయ్యప్ప కొండకు వెళ్లారు. దీంతో నందిని ఇంట్లో దీపం వెలిగించి సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. దీపం వల్ల ఇంట్లో ఉన్న సిలిండర్ పేలి ఇంటి సామగ్రి కాలిపోయింది. అప్రమత్తమైన చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. సిలిండర్ పేలే సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

నడిరోడ్డుపై బర్త్ డే వేడుకలు

పోలీసుల అదుపులో యువకులు ?

కడప(క్రైం), డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజారెడ్డివీధిలో బుధవారం రాత్రి ఓ యువకుడు మరి కొందరితో కలిసి నడిరోడ్డుపై జన్మదిన వేడుకలు నిర్వహించారు. రోడ్డుపైనే భారీగా బాణసంచా పేల్చడంతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వారిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేపు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం

కడప మారుతీనగర్, డిసెంబరు 18, (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సమస్యలపై నేరుగా సంబంధిత కడప రీజనల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా ఈనెల 20వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు వారి సమస్యలు, సూచనలు, సలహాలను తమ దృష్టికి తీసుకువచ్చేలా 9959225848 అనే నెంబర్‌కు డయల్ చేసి కానీ, వాట్సాప్ ద్వారా కానీ తెలియపరచాలని కోరారు.

రెవెన్యూ సదస్సులతో ప్రజా సమస్యల పరిష్కారం



ఫేస్ టు ఫేస్

రైల్వేకోడూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులలో ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్ తెలిపారు.

ప్రశ్న: రెవెన్యూ సదస్సులతో ప్రజలకు కలిగే ప్రయోజనాలు

జవాబు: సదస్సులతో. రెవెన్యూ శాఖ పరమైన సమస్యలను పరిష్కరిస్తున్నాం.

ప్రశ్న: ఇప్పటి దాకా ఎన్ని వినతిపత్రాలు అందాయి

జవాబు: 172 వినతిపత్రాలు అందాయి. వీటిలో అతుకుబడి పట్టాలు ఉన్నాయి. వాటిని పరిష్కారం చేసేందుకు జాయింట్ కలెక్టర్‌కు పంపి ఉన్నాము. ఆన్‌లైన్ కానివి ఎక్కువగా రాలేదు. ఒకటి వచ్చి అది కూడా పరిష్కారం చేస్తున్నాం. అతుకుబడి పట్టాలను జిరాయితీ పట్టాలు మార్పు చేసేందుకు అనుమతి తీసుకున్నాము.

ప్రశ్న: శ్రీనివాసపురం వంక పోరంబోకులో పట్టాలు ఇస్తున్నారా?

జవాబు: వంక పోరంబోకును ఆక్రమించుకుని సాగు చేస్తున్న వారు పట్టాలు ఇవ్వమని అడిగారు. అలా కుదరదని తేల్చి చెప్పాం.

ప్రశ్న: ఇప్పటికి ఎన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు

జవాబు: నాలుగు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. ఇంకా 14 గ్రామాల్లో నిర్వహించాల్సి ఉంది.

ప్రశ్న: భూ సర్వేల కోసం వినతులు వస్తున్నాయా?

జవాబు: భూ సర్వేలతోపాటు, రేషన్ కార్డులు, ఆధార్‌కార్డులు, పింఛన్లు తదితర వినతులు అందుతున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: పాత పట్టాలను ఆన్‌లైన్ చేస్తున్నారా?

జవాబు: పాత పట్టాలను ఆన్‌లైన్ చేయడానికి ఆర్‌హెచ్, ఈసీల కోసం రిజిస్ట్రార్‌కు పంపాం. రాగానే పరిశీలించి ఆన్‌లైన్ చేస్తాం.

పొంచి ఉన్న ప్రమాదం..

● రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు ● ఒక్కదానికీ.. కంచె లేదు

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి); జాతీయ రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడంతో అవి ప్రమాదకరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. లక్కిరెడ్డిపల్లెలోని వేంపల్లె - రాయచోటి మార్గంలోని మిస్బా చర్చి, మనీషా హైస్కూల్, హెచ్‌పీ పెట్రోల్ బంకు, ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఇలా నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు దర్శమిస్తున్నాయి. రోజూ పెద్ద ఎత్తున గ్రామీణులు, పట్టణవాసులు సందర్శించే తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కూడా రోడ్డుకు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. వీటన్నింటికీ రక్షణ కంచెలు గానీ, ప్రహరీ గోడ గానీ లేవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. వేంపల్లె-రాయచోటి జాతీయ రహదారి నిత్యం కిటకిటలాడుతూ ఉంటుందని, దీనికి తోడు ట్రాన్స్‌ఫార్మర్ కిందనే హోటల్, పక్కనే మెకానిక్ షాపులు ఉన్నాయి ఏళ్ల గడుస్తున్నా ఈ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ప్రహరీ గోడగానీ, కంచెగానీ లేదు, ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు చుట్టూ కంచెగానీ, ప్రహరీ గోడ కానీ ఏర్పాటు చేసి, ప్రమాదాలబారి నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



వేంపల్లె-రాయచోటి జాతీయ రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

బలిజలకు రాజకీయంగా అడ్డుపడడం దుర్మార్గం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్

రాజంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమ మొత్తానికి రాజంపేటలో మాత్రమే బలిజ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి టీడీపీ అసెంబ్లీ టికెట్ ఇచ్చిందని, కావాలనే కొందరు ఆయనను ఓడించారని, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా సైతం బాధ్యతలు నిర్వహించకుండా అగ్రవర్ణాలకు చెందిన ఒక మంత్రితో పాటు ఇతరులు అడుగడుగునా అడ్డుకోవడం దారుణమని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ విమర్శించారు. రాజంపేట పట్టణంలోని గీతాంజలి విద్యాలయాల సముదాయంలో ఆ విద్యా సంస్థల అధినేత సంబావు వెంకటరమణ అధ్యక్షతన బుధవారం సాయంత్రం జరిగిన బలిజ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం రాయలసీమలో ఒక్క బలిజ నాయకుడికి సముచిత స్థానం లేకపోవడం బాధాకర మన్నారు. ఈ నెల 22న బలిజ, కాపు, తెలగ, ప్రజాప్రతినిధులు ఆత్మీయ సమా వేశం కడపలోని మేడా కల్యాణమండపంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని బలిజ, కాపు, తెలగ సామాజికవర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతున్నందున, అందరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బలిజ సంఘ నాయకులు, కడప మాజీ జడ్పీటీసీ బట్టరుశెట్టి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు సత్య, మాజీ కార్పొరేటర్ బండి బాబు, మాజీ కౌన్సిలర్ న్యాయ వాది వెంకటసుబ్బయ్య, గీతాంజలి విద్యా సంస్థల డైరెక్టర్ వినయ్, మాజీ సర్పంచ్ డాక్టర్ తోట రామయ్య, ఊటుకూరు ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షుడు నామా హరినాథ్, అత్తిరాల దేవస్థానం మాజీ చైర్మన్ బండారు బాలయ్య, వెంకట రాజంపేట నాయకులు సుధాకర్, సాయినగర్ నాయకులు ఈశ్వరయ్య, అగ్రహారం నాయకులు సుధాకర్, టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం సెల్ కార్యదర్శి పలుకూరి ఉగ్రవీంద్ర, జనసేన పార్టీ నాయకులు అబ్బిగారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలిశెట్టి హరిప్రసాద్

ఆక్రమణలను తొలగించండి : ఆర్డీవో

గాలివీడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను వెంటనే తొలగించాలని రెవెన్యూ సిబ్బందిని ఆర్డీవో శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం గాలివీడు రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన ప్రభుత్వ స్థలం ఆక్రమణలపై ఆరా తీశారు. ఆక్రమణదారులకు గతంలో 7 నోటీస్ అందించి 15 రోజులు గడువు ఇచ్చామని, వారు స్పందించక పోవడంతో తదుపరి 6 నోటీస్ అందించామన్నారు. అయినా స్పందించకప పోవడంతో ఆక్రమణలను తొలగించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్రీధర్ ఆయన దృష్టికి తెచ్చారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు గాంధీ విగ్రహం చుట్టూ ఉన్న చికెన్ సెంటర్లను, రేకుల షెడ్లను కూడా తొలగించనున్నట్లు వివరించారు. గోరాన్ చెరువులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో మాట్లాడుతూ భూ వివాదాలు, సరిహద్దు, మ్యుటేషన్, ఆక్రమణలు తదితర సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. రైతులు పూర్తి స్థాయి భూ రికార్డులతో ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవా లన్నారు.



గోరాన్‌చెరువులో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో పాల్గొన్న ఆర్డీవో శ్రీనివాసులు

ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రఘురాం, తహసీల్దార్ భాగ్యలత, డీటీ శ్రీధర్, ఆర్ఐ బాలాజీ పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే చెల్లించాలి

రాజంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, సరెండర్ లీవులు, మెడికల్ తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నమయ్య జిల్లా ఎస్టీయూ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మన్నూరు ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ రీజనల్ కన్వీనర్ నరసింహులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనా బకాయిలు చెల్లించలేదన్నారు. ప్రతినెలా సర్దుబాటుపేరుతో ఉపాధ్యాయులను ఇబ్బందికి గురిచేయడం మంచిది కాదన్నారు. జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి మాట్లాడుతూ 117 జీవో రద్దును స్వాగతిస్తున్నామన్నారు. హైస్కూళ్లల్లో ప్లస్ స్థానంలో జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసి 2 ఇంక్రిమెంట్లతో కూడిన ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ గడువు ముగిసి ఏడాది దాటుతున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ఓబులేశు, రాధాకృష్ణ, శ్రీనివాస్‌వర్మ, సర్తాజ్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర బాధ్యుడు అల్లం అశోక్‌కుమార్, ఎల్లయ్య, మురళిమనోహర్, శ్రీనివాసులు తితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న సుబ్రమణ్యంరాజు

గురువుల ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తమను కాంట్రాక్టు ఉపాధ్యాయులుగా 33 రోజులుగా గిరిజన పాఠశాలల్లోని ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్ద చేస్తున్న దీక్షకు సీపీఎం జిల్లా కార్యదర్శి పీ. శ్రీనివాసులు బుధవారం సంఘీభావం తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ట్రైబల్ గురుకుల పాఠశాలల్లో పదేళ్ల నుంచి పని చేస్తున్న ట్రైబల్ టీచర్ల స్థానంలో డీఎస్సీ నియామకాలను మినహాయించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి హరిశర్మ, సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిస్కం అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, యూటీఎఫ్ జిల్ల ప్రధాన కార్యదర్శి జాబీర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ చనిపోయిన లేదా రిటైర్ అయిన వారి స్థానాల్లో డీఎస్సీ ద్వారా చేపడతామని, ఔట్‌సోర్స్ పద్ధతిలో పనిచేసే వారిని తొలగించి, లేదా డిమోషన్ చేసి పార్ట్ టైం టీచర్లుగా మార్చే సంస్కృతి గతంలో ఎన్నడూ లేదన్నారు. ఈ కార్యక్రమం లో శ్రీనివాసులు నాయక్, హరిత, సరోజ, సీఐటీయూ నాయకులు రామాంజుల్‌రెడ్డి, మాధవయ్య, ట్రైబల్ టీచర్స్ మహదేవ్, విజయకుమారి, స్వర్ణ, లక్ష్మీదేవి, రెడ్డెమ్మ, ప్రదీప్, సౌజన్య, దేవి, కాదంబరి, గీత, సుధాకర్, సుమతి, ప్రకాశ్, వనిత, త్రివేణి, కల్పన, సుభాషిణి, చందన, సుజాత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న సీపీఎం నాయకుడు శ్రీనివాసులు

ఉపాధ్యాయుడి వైద్యానికి ఆర్థిక సాయం



ఉపాధ్యాయుడి కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న స్కూలు యాజమాన్యం

రైల్వేకోడూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విక్టరీ స్కూలులో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న నాగేంద్రకుమార్‌కు ఇటీవల పక్షవాతంతో ఆస్పత్రి పాలయ్యాడు. బుధవారం స్కూలు విద్యార్థులతో కలసి విరాళాలుగా సేకరించిన రూ. 1,05,000 లను ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు స్కూలు యజమానులు నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డి తెలిపారు.

నోపార్కింగ్ ఏరియాలో వాహనాలు నిలిపితే చర్యలు

రాయచోటిటౌన్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): నోపార్కింగ్ ఏరియాల్లో వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తప్పవని రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలిపిన వారికి జరిమానాలు విధించారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపితే కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనాలపై వేగంగా వెళ్లేటపుడు కుటుంబ సభ్యులను ఓ సారి గుర్తు చేసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినపుడు ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులు బాధపడాల్సి ఉంటుందన్నారు.

బోరు, మోటారు ప్రారంభం

రాయచోటిటౌన్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని ఎగువ అబ్బవరం హరిజనవాడలో బుధవారం బోరు మోటారును మున్సిపల్ కమిషనర్ వాసు, అర్చన విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పీ. మదన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సుధాకర్‌నాయక్, ఏఈ మునీంద్ర, కిరీటి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, మాజీ కౌన్సిలర్ రామయ్య గ్రామ నాయకులు పెద్దిరెడ్డి, రామకృష్ణ, రాజేంద్ర, రమణ పాల్గొన్నారు.



బోరును ప్రారంభిస్తున్న అధికారులు

మహిళ అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు

గాలివీడు, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని పెద్దూరులో నివాసముంటున్న గుండ్లూరి రత్నమ్మ కనిపించడం లేదంటూ ఆమె భర్త ఆంజనేయులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మతిస్థిమితం లేని కారణంగా ఈ నెల 16న సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయి నట్లు తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల్లో ఎక్కడైనా ఆమె ఆచూకీ తెలిస్తే పోలీస్ స్టే షన్‌లో గానీ, సెల్ 7569690966 నంబరు కు గానీ సమాచారం అందించాలని కోరారు.



రత్నమ్మ (ఫైల్‌ఫొటో)

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

రాయచోటిటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని బుధవారం ఐటీడీపీ కసినేని మహేందర్‌నాయుడు ఆధ్వర్యంలో గ్రామ నాయకులు మాధవరం-1 సచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వంలో ప్రజల భూమిని దోచుకున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సురేంద్ర, రాంమోహన్, వెంకట గంగన్న, కుర్రపోతుల శివ, నరేశ్, శివ, శబరీశ్, కృష్ణమూర్తి, మారుతి, కసినేని రఘునాధనాయుడు, పేయల మనోహర్‌నాయుడు, జురుకు ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ప్రజల పక్షాన నిరంతర పోరాటాలు

రైల్వేకోడూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజల పక్షాన నిలిచి నిరంతరాయంగా పోరాటాలు చేస్తామని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి సిగె చిన్నయ్య తెలిపారు. పార్టీని స్థాపించి రెండేళ్ల పూర్తయి సందర్భంగా బుధవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికల సాకుతో కేంద్ర ప్రభుత్వం సమస్యలను పక్కదారి పట్టిస్తోందన్నారు. రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చే శారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుజ్జల రమణయ్య, వడ్డి జయసింహ, సభాపతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

రాజంపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ఆశ యాలను నెరవేర్చే బాధ్యత విద్యార్థులపై ఉందని అన్నమాచార్య ఫార్మసీ కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి తెలిపారు. బుధవారం కళా శాలలో బీఫార్మసీ, ఫార్మా డీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇనాగరే షన్, ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. పట్టుదల, కృషితో విద్యనభ్యసించి తల్లిదండ్రులకు, కళాశాలకు గొప్ప కీర్తిని తీసుకురావాలని కోరారు. కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.ద్వారకనాథ్‌రెడ్డి ఫార్మసీ కోర్సులతో ఉద్యోగావకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, కోశాధికారి సి.అభిషేక్ రెడ్డి, చైర్మన్ సి. రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.స్వర్ణలత డాక్టర్ ఆదినారాయణ, గిరీష్‌కుమార్ విద్యార్థులందరికి అభినందనలు తెలియజేశారు.

20, 21 తేదీల్లో రాయచోటిలో రెవెన్యూ సదస్సులు

రాయచోటిటౌన్, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20, 21వ తేదీల్లో రాయచోటి మున్సిపాలిటీలో రెండు చోట్ల రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పుల్లారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు 20న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మున్సిపాలిటీలోని ఎగువ అబ్బవరం గ్రామ సచివాలయంలో, 21న ఎస్ఎన్ కాలనీలోని సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

వంట ఏజెన్సీ మార్పునకు చర్యలు తీసుకోండి

సిద్దవటం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బెటాలియన్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో వంట ఏజెన్సీ మార్పునకు అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యాకమిటీ చైర్మన్ హరికృష్ణయ్య డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతలో లోపం ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి గుర్తించి, వంట ఏజెన్సీని తొలగించాలని ఆదేశాలు జారీ చేసినా, డిసెంబరు 13న పిల్లల తల్లి దండ్రుల కమిటీ సమావేశం తీర్మానించినా ఫలితం లేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోని పక్షంలో ఈ విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు : జేడీఏ

పుల్లంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గుర్తింపు కార్డులున్న కౌలు రైతు లందరికీ బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పిస్తామని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తెలిపారు. బుధవారం ఆయన రాజుగారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని పరిశీలించి రైతులకు సలహాలు అందించారు. రైతులు తప్పనిసరిగా రాగి, జొన్న, కొర్ర పంటలు వేయాలని కోరారు. ఆకుతోటలు, పూలతోటల్లో, మామిడి, అరటి పంట సాగుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను శాస్త్రవేత్త సందీప్‌నాయక్ వివరించారు. అనంతరం లక్ష్మీకర్‌రెడ్డి, పెంచల్‌రెడ్డి సాగు చేస్తున్న పూల తోటలను సందర్శించి వాటికి వచ్చిన తెగుళ్లు, మచ్చలు నివారణకు మందులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కవిత, పశువైద్యాధికారి సుధీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : కడియాలపల్లెలో జేడీఏ వరి పొలాలను పరిశీలించారు. అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త సందీప్‌నాయక్ ఏడీఏ కవిత, ఏవో మల్లిక, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.



రాజుగారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి

గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

రామాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మండలంలో అన్ని గ్రామాలను పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని కడప జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి అన్నారు. స్థానిక మండల పరిషత్ సభా భవనంలో బుధవారం గ్రామాల అభివృద్ధిపైన సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ స్థాయి అధికారులు, గ్రామాల అభివృద్ధిపైన దృష్టి సారించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా చిన్న చిన్న కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నారు. అత్యాచారాల నివారణపై దృష్టి సారించా లన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాషువా, ఏవో చాంద్‌బాషా, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ డిప్యూటీ సీఈవో మైథిలి

మినీ గోకులాల పరిశీలన

రామాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామ పంచాయతీలో క్యాటిల్ షెడ్‌లను బుధవారం ఉపాధి పీడీ వెంకటరత్నం తనిఖీ చేశారు. అనంతరం స్త్రీశక్తి సభాభవన్‌లో ఉపాధి సిబ్బంది అందరితో అన్ని పారామీటర్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలానికి 74 క్యాటిల్ షెడ్లు మంజూరయ్యాయని, ఇవన్నీ ఈ నెల 31 లోగా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ శివయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీని నమ్ముకున్న దళితులకు న్యాయం చేయండి

రైల్వేకోడూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీని నమ్ముకున్న దళితులకు న్యాయం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుల్లెల రమేష్‌బాబు విన్నవించారు. బుధవారం అమరావతిలో ఆయన లోకేశ్‌ను కలిసి నియోజకవర్గంలోని సమస్యలు వివరించారు. అనంతరం ఆయన మాటాడుతూ రైల్వేకోడూరు నియోజక వర్గంలో ఎస్సీ, బీసీ, మైనార్టీలకు సమ న్యాయం జరగాలని కోరామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నో కేసులు అనుభవించామని, ఎన్నికల సమయంలో చాలా కష్టపడ్డామని వివరించామన్నారు. తనతో పాటు నాయకులు ఓబిలి చంద్రమౌళి, సిగమాల నరేష్, జనార్దన్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారన్నారు.



నారా లోకేశ్‌కు సమస్యలు విన్నవిస్తున్న రమేష్‌బాబు

లోకేశ్‌ను కలిసిన లారీ సుబ్బరాయుడు

చిట్వేలి: ఉండవల్లిలోని సీఎం నివాసంలో బుధవారం మంత్రి నారా లోకేశ్‌ను కలిసి మండల సమస్యలను వివరించినట్లు చిట్వేలి మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు లారీ సుబ్బరాయుడు తెలియజేశారు. భవిష్యత్‌లో పార్టీ ఉన్నతికి కృషి చేయాలని ఆయన ఆదేశించినట్లు వివరించారు.

రైల్వేకోడూరులో వర్షం

రైల్వేకోడూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం వర్షం కురిసింది. వర్షాలు ఎక్కువ కావడంతో చలి పెరిగిపోయింది. దీంతో ఆస్మా, అలర్జీ రోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వృద్ధుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తరచూ వర్షాలు కురవడంతో వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

చలిగాలులతో వణుకుతున్న పల్లెలు

పెనగలూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం ఉదయం నుంచి మండల వ్యాప్తంగా వాతావరణం ముసురుకుని ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు చలిగాలులతో ప్రజలు వణికిపోయారు. పగలు కూడా దుప్పట్లు కప్పుకుని ఇంటిలోనే ఉండిపోయారు. ఇదిలా ఉండగా అప్పుడప్పుడు చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఇలాగే కొనసాగితే జబ్బులు చుట్టుముట్టే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు.

కేజీబీవీకి వాటర్ ట్యాంక్ విరాళం

సుండుపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి మానవత సంస్థ మండల చైర్మన్ మిన్నమరెడ్డి గంగిరెడ్డి 2 వేల లీటర్ల వాటర్ ట్యాంక్ అందజేసినట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శివకృతి బుధవారం తెలిపారు. సుమారు రూ.16 వేలు వెచ్చించి ట్యాంకును అందజేసిన గంగిరెడ్డికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా, కార్యదర్శి చెంగల్‌రాయుడు, సభ్యులు యర్రపురెడ్డి ఆనందరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్ అందజేస్తున్న 'మానవత' సభ్యులు

విద్యార్థులు, వృద్ధులకు దుస్తుల పంపిణీ



విద్యార్థులతో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ ప్రతినిధులు

రామాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహ కారంతో పోరుమామిళ్లలోని చిత్తశుద్ధి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రామాపురం మండలం లోని కస్తూరిబా బాలికల పాఠశాల, సెయింట్ మేరీస్ ప్రాథమికోన్నత పాఠశాల, ఆర్ఎం చర్చి విచారణ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 430 మందికి సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి, చిత్రా దంపతులు క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం దుస్తులు అందజేయ గా, సంస్థ ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి వారికి అందజేశారు. రెవరెండ్ ఫాదర్లు చిన్నప్ప, సురేశ్, కస్తూరిబా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పుష్పలత హాజరయ్యారు.

ధనుర్మాస పూజలు

రామాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని నీలకంఠ్రావుపేట, కోదండ రామాలయం, వాసవీ కన్యకాపరమేశ్వర ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు.

ఉరుసులో చట్టాన్ని ఉల్లంఘించరాదు

● పీస్ కమిటీ సమావేశంలో సబ్‌కలెక్టర్



మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లెటౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం మండలం కలిచెర్ల వద్ద మౌలా కా పహాడ్ ఉరుసు ఉత్సవాల నిర్వహణలో చట్టాన్ని అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తారని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో కడప అమీన్‌పీర్ దర్గా (పెద్ద దర్గా) పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేనీ వర్గం వారు, కలిచెర్ల మౌలా కా పహాడ్ పీఠాధిపతి హైదరాబాద్‌కు చెందిన అన్సారుల్ హక్ వర్గాలకు చెందిన వారితో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్సారుల్ హక్ వర్గం ఈనెల 26,27,28 తేదీల్లో కలిచెర్లలో ఉరుసు ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారని కడప పెద్ద దర్గా పీఠాధిపతి వర్గం వారు ఆక్షేపించారు. ఈ దర్గాపై సర్వహక్కులు కలిగిన వారే ఉరుసు ఉత్సవాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. అన్సారుల్లాహక్ మాట్లాడుతూ తమ తాతముత్తాతల నుంచి ఈ దర్గాపై తమకు హక్కులు ఉన్నాయని తామే ఉరుసు నిర్వహిస్తామని చెప్పారు. దీనిపై సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఇరువర్గాలు వారి వద్ద ఉన్న దర్గా డాక్యుమెంట్స్ తీసుకురావాలని వాటిని పరిశీలించాకే ఎవరికైనా దర్గా ఉరుసు ఉత్సవాలకు అనుమతిస్తామని తెలిపారు. మదనపల్లె డీఎస్పీ కొండయ్య మాట్లాడుతూ అనుమతి లేకుండా కలిచెర్ల ఉరుసు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన వారిపై పోలీసు కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అంతవరకు కలిచెర్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించాలని ములకలచెరువు సీఐ కృష్ణప్ప, పెద్దమండ్యం ఎస్ఐలను ఆదేశించారు.

రెవెన్యూ సదస్సులో 'సైబర్ క్రైమ్ కాల్' కలకలం!



ఫోన్ చేసిన నిందితుడు ఇతనే..

కలికిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పారపట్ల గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సుకు కలెక్టరు చామకూరి శ్రీధర్ హాజరు కానున్న నేపథ్యంలో సదస్సు వద్ద ఒక సైబర్ క్రైమ్‌కు సంబంధించిన కాల్ కలకలం రేపింది. కలెక్టరు రాక కోసం అంతా ఎదురు చూస్తున్నంతలోనే ఒక రెవెన్యూ అధికారికి వాట్సాప్ కాల్ వచ్చింది. మాట్లాడుతుండగానే ఆయనలో మొదలైన పలువురిలో ఆందోళన పెంచింది. జరిగిన సంభాషణ ఏమిటంటే.. మీ అబ్బాయి (పేరుతో సహా చెప్పాడు) డ్రగ్ కేసులో ఇరుక్కున్నాడు. నేను ఐజీ మాట్లాడుతున్నాను. వెంటనే రూ.50 వేలు పంపాలి. తరువాత మాట్లాడుతాను.. అని. ఆ వెంటనే ఆయన కాల్‌ను హోల్డ్‌లో వుంచి తన కుమారుడికి ఫోన్ చేసి ఎలా వున్నావని అడుగుతూ వచ్చిన కాల్ గురించి వివరిస్తే.. ఇవన్నీ మామూలే పట్టించుకోకండి. కాల్‌కు రెస్పాండ్ కాకండని సలహా ఇచ్చాడు. దీంతో ఆయన ఫోన్ కట్ చేసి అక్కడే వున్న కలికిరి పోలీస్ ఇన్‌స్పెక్టరు రెడ్డిశేఖర్ రెడ్డికి జరిగిన విషయం వివరించాడు. ఇవన్నీ సైబర్ క్రైమ్ వ్యవహారాలని, వీటి విషయంలో జాగ్రత్తగా వుండాలని సీఐ సూచించారు. ఎలాంటి లింకులకు కూడా స్పందించవద్దని చెప్పారు. తరువాత ఆ రెవెన్యూ అధికారి ఫోన్‌ను పరిశీలించగా +92 3352440457 నంబరు నుంచి వచ్చినట్లు గుర్తించారు. ఇది పాకిస్తాన్ నంబరుగా తేలింది. కాగా ఫోన్ చేసిన ఆగంతకుడి స్క్రీన్ షాట్ ఫోటోను తీసి గూగుల్‌లో వెతగ్గా ఇటీవలి కాలంలో ఈ ఆగంతకుడు చేసిన అనేక మోసాల గురించి ఫోటోలతో సహా బయటపడ్డాయి.

బోరుమోటార్ పగులగొట్టి కేబుల్ వైరు చోరీ



బోరు మోటార్‌ను పగులగొట్టి కేబుల్ వేరు చేసిన దృశ్యం

నిమ్మనపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేబుల్ వైరు దొంగలు ఎతంటి సాహసానికైనా తెగిస్తున్నారు. మూష్టూరు పంచాయతీ యర్రప్పగారిపల్లికి చెందిన రైతు సహదేవ వ్యవసాయ బోరు మోటార్‌ను మూడు రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు పగుల గొట్టి 60మీటర్ల వైరు దొంగలించారు. అంతే కాకుండా 15రోజులుగా గ్రామంలోని వ్యవసాయ బోర్ల వద్ద వున్న స్టార్టర్‌లను, వైర్లను దొంగలించారు, రైతు మాట్లాడుతూ తన వ్యసాయ పొలంలో వరి పంట వేసేందుకు నారు విత్తేందుకు బోరు వద్దకు పోగా అప్పటికే బిగించిన బోరు మోటర్‌ను పగలగొట్టి వేరు చోరీచేశారన్నారు. గతంలో కూడా పలు మార్లు స్టార్టర్లు దొంగలించినట్లు వాపోయాడు. దీంతో బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి దొంగల పట్టుకొని తన కేబుల్ ఇప్పించాలని కోరారు.

వంగ రైతుల పంట పండింది



మార్కెట్‌కు తరలించేందుకు సంచుల్లో నింపుతున్న కాయలు

● పెరిగిన వంకాయల ధరలు
● తమిళనాడు మార్కెట్‌లో భారీ డిమాండ్
● కేజీ రూ.30 నుంచి రూ.70కి పెరుగుదల
● ధరలు ఇలాగే కొనసాగితే రైతులకు సిరులు
● ఆనందంలో వంగ రైతులు

ములకలచెరువు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వంగ రైతుల పంట పండింది. చెన్నై మార్కెట్‌లో వంకాయల ధరలు ఆకాశాన్నంటాయి. వారం రోజుల వరకు రూ.25 నుంచి రూ.30 వరకు పలికిన ధర ప్రస్తుతం ఏకంగా రూ.60 నుంచి రూ.70కి చేరాయి. వరుసగా వచ్చిన రెండు తుఫాన్ల కారణంగా కురిసిన భారీ వర్షాలకు తమిళనాడు రాష్ట్రంలో సాగైన వంకాయ పంటలు దెబ్బతిన్నాయి. అలాగే మన ప్రాంతంలో రైతులు టమోటా పంట భారీగా సాగు చేశారు. దీంతో వంగ సాగు భారీగా తగ్గిపోయింది. ఫలితంగా ధరలు పెరగడంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ధరలు ఇలాగే కొనసాగితే రైతులకు కాసుల వర్షం కురవనుంది. టమోటా ధరలు ఏడు నెలల పాటు ఆశాజనకంగా ఉండటంతో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో రికార్డు స్థాయిలో టమోటా పంట సాగైంది. ధరలు ఇలాగే ఉంటాయని భావించి అత్యధిక మంది రైతులు ఇతర పంటల వైపు ఆసక్తి చూపలేదు. దీంతో వంగ పంట సాగు భారీగా తగ్గిపోయింది. నియోజకవర్గంలో ప్రతిఏటా ఈ సమయంలో సుమారు వెయ్యి ఎకరాల వరకు వంగ పంట సాగయ్యేది. ప్రస్తుతం కేవలం వంద ఎకరాలకు పైగా వంగ పంట సాగై దిగుబడి వస్తోంది. ఎకరా వంగ పంట సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.80 లక్షల వరకు ఖర్చు వస్తోంది. ఇక్కడ పండే వంకాయలకు తమిళనాడు రాష్ట్రంలో డిమాండ్ ఉంటుంది. ఈ ప్రాంతంలో పండిన వంకాయలను వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసి చెన్నై మార్కెట్‌కు తరలిస్తారు. అలాగే పలువురు రైతులు పండిచిన వంకాయలను స్వయంగా వారే చెన్నైకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. ఇక్కడి వంకాయలకు డిమాండ్ ఉంటే తమిళనాడు రాష్ట్రంలో ఈనెలలో వరుసగా వచ్చిన రెండు తుఫాన్ల కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. దీంతో అక్కడ సాగైన వంగ పంట పూర్తిగా దెబ్బతింది. ఫలితంగా ధరలు భారీగా పెరగడానికి కారణమైంది. దీంతో రెండు రోజుల క్రితం చెన్నై మార్కెట్‌లో ఉజాల రకం వంకాయలు కేజీ రూ.60 నుంచి 70 వరకు పలికాయి. అలాగే రెండో రకం వంకాయలు రూ.50 వరకు పలికాయి. ములకలచెరువు మండలం పాత గూడుపల్లెకు చెందిన రైతులు రాజారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు ఉజాల రకం వంకాయలను చెన్నై మార్కెట్‌కు తరలించగా కేజీ రూ.70 పలికింది.



చెట్లలోని వంకాయలు



ములకలచెరువు మండలం చెరువుకిందపల్లె సమీపంలో సాగైన వంకాయ తోట

పది ఎకరాల్లో వంగ సాగు చేశా

- ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వంగ రైతు, పాత గూడుపల్లె



పది ఎకరాల్లో ఉజాల వంగ పంట సాగు చేశాను. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం ఏడు ఎకరాల్లో వంకాయలు దిగుబడి వస్తున్నాయి. వారం రోజుల వరకు కేజీ రూ.30 వరకు పలికిన ధర ఒక్కసారిగా పెరిగిపోయింది. కోత విధించి నాలుగు టన్నుల కాయలను సోమవారం సాయంత్రం చెన్నై మార్కెట్‌కు తరలించాను. అక్కడ కేజీ రూ.70 చొప్పున పలికింది.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు కోడూరు విద్యార్థి



విద్యార్థి అరవింద్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు

రైల్వేకోడూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎస్వీ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థి మోసిన అరవింద్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎన్ శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయుడు పుల్లారావు తెలిపారు. ఈ నెల 14 నుంచి 17 వరకు గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అరవింద్ ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. జనవరి 13, 14 తేదీల్లో మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. ఆ విద్యార్థిని కళాశాల డైరెక్టర్ వసుంధర, అధ్యాపక బృందం తదితరులు అభినందించారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్లు జైలుశిక్ష

సిద్దవటం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తమిళనాడు రాష్ట్రానికి చెందిన పొన్నాప్ పళని అనే వ్యక్తికి ఐదేళ్ల జైలు, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ ఓబులేశు తెలిపారు. 2018 అక్టోబరు 15న సిద్దవటం బీట్‌లోని చంచల చెలమ వద్ద ఎర్రచందనం దుంగలు స్మగ్లింగ్ చేస్తుండగా అప్పటి ఫారెస్ట్ రేంజి అధికారి ప్రసాద్ అతనిని అరెస్ట్ చేసి తిరుపతి రెడ్‌శాండిల్ అడిషనల్ సెషన్స్ కోర్టులో హాజరు పరచగా పై శిక్ష విధిస్తూ బుధవారం జడ్జి తీర్పు ఇచ్చినట్లు వివరించారు.

ఎస్పీడీసీఎల్‌కు రూ.9కోట్ల బకాయిలు

● చేతులు మారిన మిల్లు భూములు
● రికవరీ సాధ్యమేనా..?

మదనపల్లెటౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు అంటేనే 40ఏళ్లకూ పైగా పేరుగాంచింది. అలాంటి స్పిన్నింగ్ మిల్లు లాకౌట్ అయ్యి మూతపడి, కార్మికులు చెల్లాచెదురయ్యారు. ఇపుడు ఈ మిల్లు భూములు బహిరంగ వేలంలో కొన్న వ్యక్తులు, చేతులు మార్చేశారని సమచారం. ఈ మిల్లు నుంచి కార్మికులకు రావాల్సిన బకాయిలు కోర్టుల చుట్టూ తిరిగి వసూలు చేసుకుంటున్నారు. ఫ్యాక్టరీలకు రావాల్సిన బకాయిలు మిల్లును కొనుగోలు చేసిన వారి నుంచి రాబట్టేశారు. కాకపోతే పదేళ్లుగా ఎస్పీడీసీఎల్‌కు స్పిన్నింగ్ మిల్లు నుంచి రావాల్సిన బకాయిల విషయమై అధికారులు ఆలస్యంగా కళ్లు తెరిచారు. ఇప్పుడు ఇక్కడ చూస్తే మిల్లు భవనాలు నేటమట్టం కాక, కేవలం భూములు మాత్రమే వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. దీంతో ఎస్పీడీసీఎల్ అధికారులు హడావుడిగా అక్కడి చేరుకుని నోటీసు బోర్డులు పెట్టారు. బుధవారం మదనపల్లె ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధర్ ఆధ్వర్యంలో సీటీఎం సమీపంలోని ఎంఎస్ఎం స్పిన్నింగ్ మిల్లు స్థలం వద్ద బోర్డు నాటారు. మిల్లు హెచ్‌టీ కనెక్షన్ మీటర్ నెంబర్ 235 నుంచి రూ.9,08,37,044 బకాయిలు రావాలని నోటీసుబోర్డులో వుంచారు. ఈ బకాయిలు చెల్లించకుంటే ఆస్తులను రికవరీ చేస్తామని, వడ్డీతో సహా ఈ బకాయిలు చెల్లించాలని నోటీసు బోర్డులో వుంచారు. కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ డీఈ సురేంద్రనాయక్ ఏఈ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంఎస్ఎం మిల్లు స్థలం ఎదుట నోటీసు బోర్డు ఏర్పాటు చేసిన మదనపల్లె ఎస్పీడీసీఎల్ అధికారులు

వైద్య కళాశాలల నుంచి భారీగా బదిలీలు

● మదనపల్లె, పులివెందుల మెడికల్ కళాశాలల నుంచి ఇతర కళాశాలలకు బదిలీ
● సర్దుబాటు పేరుతో రాష్ట్రంలోని పలు కళాశాలలకు కేటాయింపు

కలికిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె, పులివెందుల వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, అసోసియేటెడ్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను భారీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. ఫేస్-2లో చేపట్టిన ఈ రెండు మెడికల్ కళాశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానందున ఈ ఏడాది అడ్మిషన్లకు మెడికల్ కౌన్సిల్ ఆమోదం తెలపని నేపథ్యంలో ఇక్కడున్న బోధనాపరమైన అధ్యాపకులను ఫేస్-1తో సహా ఇతర పాత కళాశాలల్లో సర్దుబాటు విధానంలో బదిలీ చేసిం ది. మదనపల్లె నుంచి 34 మందిని, పులివెందు ల నుంచి 29 మందిని సర్దుబాటు పేరుతో రాష్ట్రంలోని పలు కళాశాలలకు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధానంతో మొత్తం 121 మందిని బదిలీ చేశారు. ఈ మేరకు ఆరోగ్య, వైద్య, సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మంగళవారం రెండు వేర్వేరు జీఓలు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు..

రస్తా పోరంబోకు రహదారికి విముక్తి

● దశాబ్దాల ఆక్రమణలకు తెర



రాతి కూసాలు, ముళ్ల కంచెను తొలగిస్తున్న దృశ్యం

కలికిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓ ఆసామి తన భూముల రక్షణకు భారీ గేట్లతో ముఖద్వారం, భూముల చుట్టూ వందలాది రాతి కూసాలతో ముళ్ల కంచె. లోపల ఇల్లు. అన్నీ బాగానే ఉన్నాయి. అయితే అందులో ప్రధానంగా వందలాది మంది రైతులకు ఉపయోగపడాల్సిన పెద్ద రస్తా పోరంబోకు రహదారి కూడా చిక్కుకుపోయింది. అటువైపు వెళ్లాల్సిన రైతులకు ప్రతిబంధకంగా మారింది. దశాబ్దాలుగా ఈ రహదారిని విడిపించుకుని వినియోగించుకోవాలని ప్రయత్నిస్తున్న వారి ఆశలు మాత్రం నెరవేరడం లేదు. అయితే బుధవారం మండలంలోని పారపట్ల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సు ఈ అతి పెద్ద అవాంతరానికి పరిష్కారం చూపిం చింది. ఈ నేపథ్యంలో తమ గ్రామంలోని సబ్ స్టేషన్ అనుకుని రస్తా పోరంబోకు ఉందని, అటు వైపు వందల ఎకరాలకు వెళ్లాల్సిన రైతులు దాని గుండా వెళ్లకుండా ఓ ఆసామి ఆక్రమించి చుట్టూ ముళ్ల కంచె ఏర్పాటు చేశారని కొంతమంది రైతులు బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టరు శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరు సర్వేయర్లను, రెవెన్యూ అధికారులతో చర్చించి పూర్వాపరాలు విచారించారు. రస్తా పోరంబోకు రహదారికి పెద్ద గేటు అమర్చిన విషయం వాస్తవమని తేలింది. వెంటనే జేసీబీ ఏర్పాటు చేయాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. తాను వెళ్లేలోగా గేటును దాంతో పాటు ముళ్లకంచెను తొలగించాలని తెలిపారు. సదస్సు ముగిసిన అనంతరం కలెక్టరు సబ్ కలెక్టరును వెంటబెట్టుకుని అక్కడికి మూడు కి.మీ దూరంలో ఉన్న రస్తా పోరంబోకు రహదారి వద్దకు చేరుకున్నారు. గేటు పెట్టిన రహదారిని బంద్ చేసిన మహబూబ్ బాషాను పిలిపించారు. ఇలా చేయడం ఏంటని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గేటును కూలగొట్టాలని ఆదేశించారు. అయితే ఒక్కో గేటు 400 కిలోలున్నాయని, ఒక్కరోజు గడువిస్తే తానే తొలగించేస్తానని అతను కలెక్టరును బతిమలాడాడు. రేపటిలోగా ముళ్లకంచెను కూడా తొలగిస్తామని తహసీల్దారు మహేశ్వరీబాయి చెప్పారు. గేటు తొలగించేందుకు ఒకరోజు గడువిస్తూ ముళ్లకంచెను మాత్రం వెంటనే తొలగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆ తరువాత రెండు గంటల్లోగానే తహసీల్దారు ముళ్ల కంచెను ప్రొక్లైనర్‌తో పూర్తిగా నేలమట్టం చేయించారు. ఎట్టకేలకు రస్తా పోరంబోకు రహదారికి విముక్తి లభించింది. సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని సునిశితంగా పరిశీలించి అప్పటికప్పుడే పరిష్కరించిన కలెక్టరు ప్రశంసలు అందుకున్నారు.



చలమారెడ్డిపల్లె కొండల్లో కమ్ముకున్న పాగమంచు

మంచుకురిసే వేళలో...



జిల్లాలో పొగమంచు కమ్ముకుంటోంది. రోజురోజుకు చలి తీవ్రత పెరగడంతో పిల్లలు, వృద్ధులు వణికిపోతున్నారు. ఉదయం 8 గంటలవుతున్నా పొగమంచు తగ్గక పోవడంతో ఇంట్లో నుంచి బయటకు రావడం లేదు. ఇక బుధవారం కడప నగరంలో పొగమంచు తీవ్రత ఎక్కువైంది. కొన్నిచోట్ల చలిమంటలు వేసుకొని సేద తీరే దృశ్యాలు కనిపించాయి. ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీల్లో వెళ్లే వారు పట్టపగలే లైట్లు వేసుకొనే పరిస్థితి కనిపించింది. చలికి నోరులేని పక్షులు అల్లాడిపోయాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



చలికి వణుకుతున్న పక్షులు



కడప నుంచి రాయచోటికి వెళ్లే రోడ్డులో ఫ్లైఓవర్ వద్ద ఉన్న మంచు



చలిమంటల కౌగిలిలో వృద్ధులు

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం : జేసీ



రైతుల సమస్యలను వింటున్న జేసీ అదితిసింగ్

ఎర్రగుంట్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి టు వేంపల్లె జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూమి కోల్పోతున్న రైతులందరికీ నిబంధనల ప్రకారం పరిహారం అందించి న్యాయం చేస్తామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. బుధవారం ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో భూములు కోల్పోతున్న ఐదు గ్రామాల రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా రైతులు తమ అభ్యంతరాలను, సమస్యలను వివరించారు. మార్కెట్ రేటు ప్రకారం భూమి విలువ రూ.కోట్లలో ఉందని.. ప్రభుత్వం తమకిచ్చేది చాలా తక్కువగా ఉందన్నారు. ప్రొద్దుటూరు రోడ్డులో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూముల ధర సెంటు రూ.3 లక్షల నుంచి రూ.4లక్షల వరకు ఉందని.. ప్రభుత్వం కేవలం ఎకరాకు 15 లక్షలు మాత్రమే ఇస్తామనడం అన్యాయం అన్నారు. దీనిపై పునరాలోచించి తమకు న్యాయం చేయాలని వారు జేసీని కోరారు. పెద్దనపాడులో రోడ్డుకు ఇరువైపులా ఇళ్లు, కలాలు తీసుకుంటున్నారని వాటికి తగ్గట్టుగా పరిహారం ఇవ్వాలని జేసీ దృష్టికి తీసుకెళ్లారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, తహసీల్దార్ శోభన్ బాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.3 కోట్ల పరిహారం ఇప్పించండి

వేంపల్లె, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో గతంలో రోడ్డు వెడల్పునకు అప్పటి ప్రభుత్వం ఎకరాకు రూ.6కోట్ల పరిహారం ఇచ్చింది.. ప్రస్తుతం ఊరిబయట వెళ్తున్న చాగలమర్రి-రాయచోటి రోడ్డుకు ఎకరాకు రూ.3కోట్లు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు రైతులు, టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. వేంపల్లె మండల పరిషత్ సభాభవనంలో బుధవారం జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో భూములు, స్థలాలు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.16లక్షలు ఉందని, సాధ్యమైనంత వరకు నిబంధనల మేరకు పెంచి పరిహారం ఇస్తామని తెలిపారు. దీనిపై టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరి రైతులకు మేలు చేయాలని కోరారు. ఆర్డీఓ చిన్నయ్య, ఎన్‌హెచ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో రైతులతో సమావేశం

వీరపునాయునిపల్లె, డిసెంబరు 18: ఎన్‌హెచ్-440 చాగలమర్రి టు వేంపల్లె జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూమి కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయం చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. బుధవారం స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో రైతులకు సమావేశం అయ్యారు. రహదారిలో భూమిపోయిన ఉరుటూరు, కీర్తిపల్లె, అయ్యవారిపల్లె, లింగాల, గంగిరెడ్డిపల్లె,తంగేడుపల్లె గ్రామాల రైతులతో మాట్లాడారు. భూమి పోయిన రైతులకు వ్యవసాయ భూమికైతే రూ.5.82లక్షలు రోడ్డు సైడ్ భూమికి అయితే రూ.11.90 లక్షలు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీంతో ప్రభుత్వం ఇస్తామంటున్న భూనష్టపరిహారానికి ఎవరికీ ఇష్టం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ లక్ష్మీదేవి, సీఐ చల్లని దొర, ఎస్ఐలు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను పట్టించుకోకపోవడం దారుణం



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సుంకర రవి

కడప నాగరాజుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొవిడ్-19లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు పణంగా పెట్టి పనిచేసిన పారిశుధ్య కార్మికులను అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నగర కమిటీ అధ్యక్షుడు సుంకర రవి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట కొవిడ్-19, అడిషనల్ కార్మికుల పెండింగ్ వేతనాల కోసం చేస్తున్న నిరసన మూడవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మూడు రోజులుగా ఆందోళన చేస్తున్న అధికారులకు వినిపించడం లేదన్నారు. ఇకపై స్పందించకుంటే ఈనెల 23న జరిగే జనరల్ బాడీ మీటింగ్‌ను అడ్డుకుంటామన్నారు. అన్ని రంగాల పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. వెంటనే జీఓ 7 ప్రకారం వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కంచుపాట తిరుపాల్, కార్యవర్గ సభ్యులు ప్రకాష్, సుంకర కిరణ్‌కుమార్, వడ్లపల్లె శ్రీధర్‌బాబు, కార్మికులు పాల్గొన్నారు.

మైలవరం జలాశయంలో మృతదేహం లభ్యం



వెంకటేష్ (ఫైల్ ఫొటో)

మైలవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయంలో బుధవారం ఊసుగాండ్ల పెద్ద వెంకటేష్ (40) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన పెద్ద వెంకటేష్ రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళుతున్నానని భార్యకు చెప్పి వెళ్లాడు. ఎంత వెతికినా దొరకకపోవడంతో జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో వెంకటేష్ భార్య సుమలత ఫిర్యాదు చేసింది. జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం వెంకటేష్ మృతదేహం లభ్యం కావడంతో జమ్మలమడుగు అర్బన్ పోలీసులకు అప్పజెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి



జమ్మలమడుగు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడే నారాయణనాయక్ (35) అనే వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని బొమ్మేపల్లె తాండాకు చెందిన నారాయణనాయక్ (35) జమ్మలమడుగు నుంచి ద్విచక్ర వాహనంలో ముద్దనూరు రోడ్డులో వెళుతుండగా రోజా టవర్ ఎదురుగా స్కూలు బస్సును ఓవర్‌టేక్ చేస్తూ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఢీకొని వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో అతనికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా దారిలో మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులుపరిశీలించి కేసు నమోదు చేశారు.

కూతురు కనిపించలేదంటూ ఫిర్యాదు

చెన్నూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె సునంద (26) కనిపించడం లేదంటూ చెన్నూరు అరుంధతీనగర్‌కు చెందిన ఓబులేసు స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. సునంద ఇడుపులపాయి ట్రిపుల్ ఐటీలో సర్టిఫికెట్లు తెచ్చుకునేందుకు ఈనెల 5న వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా.. పని కాలేదని.. పని పూర్తి చేసుకుని వస్తానని సమాచారం ఇచ్చింది. ఆ తరువాత ఫోను స్విచ్ఛాఫ్ కావడంతో ఎక్కడికి వెళ్లిందో అర్థం కావడం లేదని.. పోలీసులు విచారించి తమ కుమార్తె ఆచూకీ తెలపాలంటూ సునంద తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.







కోడూరు-రెడ్డివారిపల్లె తాత్కాలిక మార్గం దుస్థితి, కోడూరు-గుర్రప్పపాళెం గిరిజన కాలనీ మార్గంలో వెళ్లలేని స్థితి, తూర్పుపల్లె-పిట్టావాండ్లపల్లె మార్గం బంద్ అయిన దృశ్యం

మూడు గ్రామాలకు రాకపోకలు బంద్

- భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు
- పాడైన రహదారులను పునరుద్ధరించక..
- మళ్లీ వాన గండం... ఆందోళనలో పల్లె ప్రజలు

రైల్వేకోడూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) రైల్వేకోడూరులో గత సెప్టెంబరు నుంచి పలు దఫాలుగా కురిసిన భారీ వర్షాలకు చాలా గ్రామాల రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి పల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కోడూరు-రెడ్డివారిపల్లె, తూర్పుపల్లె-పిట్టావాండ్లపల్లె, కోడూరు-గుర్రప్పపాళెం గ్రామాలకు సుమారు 25 రోజులుగా రాకపోకలు బంద్ అయ్యాయి. దీంతో ఆ గ్రామాల ప్రజలు వేరే మార్గాల ద్వారా ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి రైల్వేకోడూరుకు చేరుకుంటున్నారు. రెడ్డివారిపల్లె నుంచి పాడి రైతులు పాలు తీసుకుని రైల్వేకోడూరుకు రావాలంటే రాను పోను సుమారు 10 కిలో మీటర్ల దూరం చుట్టూ తిరిగి చేరుకుంటున్నారు. బ్రిడ్జి నిర్మాణంలో ఉండడం.. తాత్కాలిక రోడ్డు వర్షాలకు ప్రతిసారి కొట్టుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా గుర్రప్పపాళెం గిరిజనులు రెడ్డివారిపల్లె మీదుగా పాటిమీదిపాళెం వచ్చి అక్కడి నుంచి చిట్వేలి రోడ్డుకు చేరుకుని రైల్వేకోడూరుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అదే విధంగా తూర్పుపల్లె నుంచి పిట్టావాండ్లపల్లె వెళ్లేదారిలో రెండు నదులు ఉండడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. నీటి ఒరవడి ఎక్కువగా ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పాడి రైతులు పాలు తీసుకుని రైల్వేకోడూరుకు రావాలంటే ఎక్కువ సమయం పట్టడమే కాకుండా చాలా దూరం వస్తుందంటున్నారు. అరటి రైతులు కాయలను ఎగుమతి చేసుకోవాలంటే నానా అవస్థలు పడుతున్నారు. ఇక విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలకు వెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. స్కూల్ వ్యాన్లు కూడా ఆయా గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. అలాగే రైల్వేకోడూరు నుంచి పై గ్రామాలకు ఎవరైనా వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. ఇక బుధవారం నుంచి వర్ష సూచన ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేసి బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాడి రైతుల కష్టాలు వర్ణనాతీతం



కోడూరు-రెడ్డివారిపాలెం మధ్య 20 రోజుల నుంచి రోడ్డు సౌకర్యం లేక సంబంధాలు తెగిపోయాయి. దీంతో ప్రజలు, రైతులు, విద్యా ర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాడి రైతులు రైల్వేకో దూరుకు పాలు తీసుకెళ్లాలంటే.. నానా అవస్థలు పడుతున్నారు. వేరే మార్గాల ద్వారా చాలా దూరం తిరిగి అనేక వ్యయ ప్రయాలతో ప్రతి రోజు పట్టణానికి చేరుకోవాల్సి వస్తోంది.

-శ్రీకారపు మస్తాన్, రెడ్డివారిపల్లె

అరటి కాయలను తీసుకెళ్లాలంటే..



రెడ్డివారిపల్లె, తూర్పుపల్లె నుంచి పిట్టావాండ్లపల్లె వరకు, గుర్రప్ప పాళెం గిరిజనుల ప్రాంతాల్లో అరటి తోటలు ఎక్కువగా సాగులో ఉన్నాయి. రోడ్లు సక్రమంగా లేకపోవడంతో అరటి కాయలను ఆ గ్రామాల నుంచి తీసుకెళ్లాలంటే కష్టంగా ఉంది. ప్రత్యామాయ మార్గాలు సక్రమంగా లేకపోవడంతో లారీలు తోటల్లోకి వెళ్లలేకపోతున్నాయి. దీంతో ఎగుమతులు నిలిచిపోయి రైతులు నష్టపోతున్నారు.

-దేశ క్రిష్ణారెడ్డి, అరటి వ్యాపారి, అనంతరాజు పేట

న్యాయవ్యవస్థను ప్రజలకు దూరం చేయడం తగదు

- ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు

కడప రూరల్, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కక్షిదారుల వివాదాలను సత్వరం పరిష్కరించడానికి న్యాయవ్యవస్థను ప్రజల ముగ్గిట్లోకి తీసుకురావాల్సిన పాలకులు ప్రజలకు దూరం చేయడం సరికాదని భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొగ్గల గుర్రప్పనాయుడులు పేర్కొన్నారు. తిరుపతిలో ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట చేపడుతున్న రిలే నిరాహారదీక్షలు బుధవారానికి 10వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలో కాకుండా తిరుపతిలో విచారణ చేపట్టేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 145ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 145 పుణ్యమా అని రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లా కేంద్రాలలో ఉన్న ఫస్ట్ ఏడీజే కోర్టులలో ఇప్పటి వరకు జరుగుతున్న ఎన్‌డీపీ ఎస్ యాక్టుకు సంబంధించిన కేసులన్నీ జిల్లా కేంద్రాలలో జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే దేశంలో 5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని సత్వర పరిష్కారం చేయడానికి మండల స్థాయి వరకు న్యాయస్థానాలను తీసుకొని వెళ్లి ప్రజలకు సత్వర న్యాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. దీక్షలకు సీపీఎం, ఏఐటీయూసీ, రైతు సంఘం నాయకులతో పాటు బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, నందలూరు బార్‌అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జాషువా, జింకా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలవండి

- సమగ్ర శిక్ష రాష్ట్ర సహిత విద్య సహాయ కోఆర్డినేటర్ అధికారి కల్పన శైల



మాట్లాడుతున్న రాష్ట్ర కోఆర్డినేటర్ కల్పన శైల

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న సౌకర్యాలను సక్రమంగా అందేలా చూడాలని సమగ్రశిక్ష రాష్ట్ర సహిత విద్య సహాయ కోఆర్డినేటర్ అధికారి కల్పన శైల మండల విద్యాశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం కడప నగర శివారులోని గీతం కళాశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల అవసరాలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు విచ్చేసి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బడి బయటఉండే విద్యార్థులందరిని బడిలో చేర్పించాలని, ప్రతి దివ్యాంగునికి ప్రభుత్వం కల్పించే ప్రతి సౌకర్య అందేలా చూడాలని కోరారు. ఇటీవలే భవిత విద్యార్థులకి ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, అలవెన్స్‌లు ఇవ్వడం జరిగిందన్నారు. ఒక్క దివ్యాంగున్ని గుర్తించి వారికి సదరం సర్టిఫికెట్ ఇప్పించడంతో పాటు, వారి ప్రగతికి అవసరమైన విద్యా బోధన, ఉపకరణాలు, ఆరోగ్య సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. బడి బయట పిల్లలు అందరు బడిలో ఉండేటట్లు చూడాలని, అందరికి విద్య అందాలని తెలియజేశారు. కార్యక్రమానికి రిమ్స్ సూపరింటెండెంట్ సైక్రియాట్రీ విభాగాధిపతి డాక్టర్ వెంకటరాముడు, క్లినికల్ సైకాలజిస్ట్ లక్ష్మీనారాయణ, అర్లీ చైల్డ్ ఇంటర్వెన్షన్ సెంటర్ డాక్టర్ ఫక్రుద్దీన్, సదరం సర్టిఫికెట్ విభాగాధిపతి నాగయ్యతో పాటు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ బ్రహ్మయ్య హాజరై వివిధ విభాగాలకు సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కడప ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి, ఏడీ కృష్ణకిషోర్, సహిత విద్య సమన్వయకర్తలు కేశవరెడ్డి, రమణమూర్తి, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో మరింత ప్రగతి సాధించాలి



మాట్లాడుతున్న ఆలపాటి శివయ్య

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం నాణ్యత ప్రమాణాలతో ఉన్నత పనితీరును కనబర్చినప్పటికీ మరింత ప్రగతి దిశగా వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ) ప్రతినిధి హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సీఈఓ ఆలపాటి శివయ్య స్పష్టం చేశారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ఐఎస్ఓ ప్రతినిధుల బృందం రెండు రోజుల సందర్శన పూర్తయింది. అనంతరం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి, కుల సచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి అన్ని శాఖల అధిపతులతో సమావేశమయ్యారు. సీఈఓ శివయ్య మాట్లాడుతూ సమగ్ర పరిశీలనలో బృందం దృష్టికి వచ్చిన పలు అంశాలను ప్రస్తావించారు. బోధన, పరిశోధనలు, పరిసరాలు నాణ్యమైనవిగా ఉన్నాయని తెలిపారు. శాఖల వారీగా ఐదు వరకు గ్రేడులు ఇచ్చారు. అక్కడక్కడ రికార్డుల నిర్వహణ మెరుగుకావాల్సి ఉందన్నారు. ప్రతి డాక్యుమెంట్‌కు సంబంధించిన ఆధారం ఫైలింగ్ చేయాలని తెలిపారు. అన్ని శాఖలు బాగా పనిచేస్తున్నాయని ప్రశంసిస్తూనే మరింతగా పనిచేస్తే ఉన్నతమైన న్యాక్ గ్రేడ్‌ను వైవీ యూ సొంతం చేసుకుంటుందన్నారు. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ ఆడిట్ సుమాదేవి మాట్లాడుతూ వైవీయూ అభివృద్ధికి మెరుగైన సూచనలు చేశారు. ఉపకులపతి ఆచార్య కెకృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడారు. ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ ఎల్ సుబ్రమణ్యశర్మ, ఐక్యూఏసీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుభాష్‌చంద్ర, సభ్యులు, అన్ని శాఖల అధిపతులు పాల్గొన్నారు.

భారీగా రేషన్ బియ్యం స్వాధీనం.. ఇరువురి అరెస్టు



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వద్ద అధికారులు

రైల్వేకోడూరు(రూరల్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ పరిధిలో అక్రమంగా నిల్వ చేసిన 9550 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు ఎస్ఐ నవీన్ బాబు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు...

బుధవారం బొమ్మవరం గ్రామానికి వెళ్లే మార్గంలో ఆటోలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఆటో డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు అనంతరాజుపేట పంచాయతీ పరిధిలోని ఓ ఇంట్లో అక్రమంగా నిలువ ఉన్న రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని చంద్ర అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సివిల్ సప్లయిస్ అధికారులు రాంమోహన్, ఆర్.లక్ష్మీదేవి, వీఆర్వో సృజిని, పోలీసులు సుధాకర్ రాజు, బాబుల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేలిన గ్యాస్ సిలిండర్ తప్పిన ప్రమాదం

కడప(క్రైం), డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రవీంద్రనగర్‌లో బుధవారం రాత్రి ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. రవీంద్రనగర్‌కు చెందిన నందిని భర్త బుధవారం సాయంత్రం అయ్యప్ప కొండకు వెళ్లారు. దీంతో నందిని ఇంట్లో దీపం వెలిగించి సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. దీపం వల్ల ఇంట్లో ఉన్న సిలిండర్ పేలి ఇంటి సామగ్రి కాలిపోయింది. అప్రమత్తమైన చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. సిలిండర్ పేలే సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

నడిరోడ్డుపై బర్త్ డే వేడుకలు పోలీసుల అదుపులో యువకులు ?

కడప(క్రైం), డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజారెడ్డివీధిలో బుధవారం రాత్రి ఓ యువకుడు మరి కొందరితో కలిసి నడిరోడ్డుపై జన్మదిన వేడుకలు నిర్వహించారు. రోడ్డుపైనే భారీగా బాణసంచా పేల్చడంతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వారిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రేపు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం

కడప మారుతీనగర్, డిసెంబరు 18, (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సమస్యలపై నేరుగా సంబంధిత కడప రీజనల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా ఈనెల 20వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు వారి సమస్యలు, సూచనలు, సలహాలను తమ దృష్టికి తీసుకువచ్చేలా 9959225848 అనే నెంబర్‌కు డయల్ చేసి కానీ, వాట్సాప్ ద్వారా కానీ తెలియపరచాలని కోరారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు : జేడీఏ

పుల్లంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గుర్తింపు కా ర్డులున్న కౌలు రైతులందరికీ బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పిస్తామని జిల్లా వ్యవసా యాధికారి చంద్రానాయక్ తె లిపారు. బుధవారం ఆయన రాజుగారిపల్లెలో పొలం పిలు స్తోంది కార్యక్రమాన్ని పరిశీలించి రైతులకు సలహాలు అందించారు. రైతులు తప్పనిసరిగా రాగి, జొన్న, కొర్ర పంటలు వేయాలని కోరారు. ఆకుతోటలు, పూలతోటల్లో, మామిడి, అరటి పంట సాగుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను శాస్త్రవేత్త సందీప్‌నాయక్ వివరించారు. అనంతరం లక్ష్మీకర్‌రెడ్డి, పెంచల్‌రెడ్డి సాగు చేస్తున్న పూల తోటలను సందర్శించి వాటికి వచ్చిన తెగుళ్లు, మచ్చలు నివారణకు మందులను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ కవిత, పశువైద్యాధికారి సుధీష్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి

స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు చేరుకోవాలి ● అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

కలకడ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని డీఎల్‌పీఓ లక్ష్మీపతి అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన ఎల్ఎస్‌డీజీ శిక్షణలో ఆయన మాట్లాడుతూ అందరూ కలిసి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సాధించాలన్నారు. మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, ఈఓఆర్డీ వెంకటసుబ్బయ్య, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

లక్ష్యాలను చేరుకోవాలి....

నిమ్మనపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్ని పంచాయతీల్లో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సుస్థిరంగా వుండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పంచాయతీల్లో ఎలాంటి సమస్య వున్నా వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈఓపీఆర్డీ చలపతిరావు కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, మారెప్ప, గౌతమి, గాయత్రి, సరస్వతి, రాజష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

గుర్రంకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలను సచివాలయ సిబ్బంది సిద్ధం చేయాలని ఎంపీడీఓ వెంకటేశులు అన్నారు. శిక్షణలో ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో అభివృద్ధి పనులను గుర్తించాలన్నారు. ప్రజలకు అవసరమయ్యే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈఓఆర్డీ బ్రహ్మానందరెడ్డి, ఎంఈఓ సురేంద్రబాబు, ఏఈలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే గ్రామాభివృద్ధి

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారుల సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు అధికారులు, సర్పంచులు సమన్వయంతో పని చేస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వెలుగు ఏపీఎం హరి, ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ పురుషోత్తం నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించుకోవాలి

తంబళ్లపల్లె, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకోవాలని ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించిన శిక్షణలో పంచాయతీల్లో ఆదాయ వనరులు, పంచాయతీల లక్ష్యాలు, గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజు, సీడీపీఓ నాగవేణి, ఈఓఆర్డి దిలీప్ కుమార్, ఏఓ థామస్‌రాజా, సచివాలయ సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

తక్షణ పరిష్కారానికే సదస్సులు

ప్రత్యేక అధికారి, డీపీఓ బాలకృష్ణారెడ్డి ● బికొత్తకోట రెవెన్యూ సదస్సులో 140 అర్జీలు

నిమ్మనపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను సత్వరపరిష్కారం కోసమే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారి, డీపీఓ బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రాచవేటి వారిపల్లి పంచాయతీ మాచిరెడ్డిగారి పల్లిలో నిర్వహించిన రెవెన్యూ సభలో ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు సభల్లోనే పరిష్కరించుకోవాలన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్ మాట్లాడుతూ డి-ఫారం పాట్టాలు కలిగిన రైతులకు శాశ్వత పట్టాలను పంజూరు చేయాలని కోరారు. సభలో 270 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ధనంజేయులు తెలిపారు.


తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న రైతులు

బి.కొత్తకోట సదస్సులో 140 అర్జీలు

బి.కొత్తకోట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బయప్పగారిపల్లె పంచాయతీ సదస్సులో వివిధ భూసమస్యల పరిష్కారం కోరుతూ రైతుల నుంచి 140 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ మహమ్మద్‌అన్సారీ, ప్రత్యేక అధికారి శ్రీకాంత్, టీడీపీ నేత జయచంద్రారెడ్డి, సీడ్ మల్లికార్జున నాయుడు, చిటికి శివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించండి

తంబళ్లపల్లె, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు అర్జీ సమర్పించారు. తంబళ్లపల్లె రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదులను అందచేశారు. ఆర్ఐ ముద్దుక్రిష్ణయాదవ్, ఫారెస్టు అధికారి రామరాజు, దేవదాయ శాఖ రికార్డు అసిస్టెంట్ కొండకిట్ట, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బూచిపల్లెలో...

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల తక్షణ పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి అన్నమయ్య జిల్లా విద్యా శాఖాధికారి సుబ్రమణ్యం పేర్కొన్నారు. బూచిపల్లె సదస్సులో తహసీల్దార్ శ్రీరాములు నాయక్‌తో కలిసి ఆయన మాట్లాడారు. సదస్సుల్లో మొత్తం 76 అర్జీలు వచ్చాయన్నారు. ఆర్ఐ బాలాజీ, మండల సర్వేయర్ శ్రీవాణీ, డిప్యూటీ తహసీల్దార్ దనంజయులు, వీఆర్వో, నేతలు పాల్గొన్నారు.

మండలవారిపల్లిలో....

పెద్దమండ్యం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కారం కోసమే రైతు సదస్సులని పెద్దమండ్యం నోడల్ అధికారి, హౌసింగ్ పీడీ సాంబశివ పేర్కొన్నారు. రైతు సదస్సులో రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్, సర్పంచ్ రమణమ్మ, ఆర్ఐ రమేష్, మండల సర్వేయర్ హసీన్‌తాజ్, వీఆర్ఓ రెడ్డిశేఖర, దేవదాయ శాఖ అధికారి రెడ్డిక్రిష్ణ, హౌసింగ్ ఏఈ అక్రం, జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కురబలకోటలో....

కురబలకోట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే ధ్యేయమని జిల్లా సర్వేయర్ భరత్‌కుమార్, తహసీల్దార్ తపస్వి పేర్కొన్నారు. కురబలకోటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులో 45 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో ఆర్ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తైవాన్ ఇంటర్న్‌షిప్‌కు మిట్స్ విద్యార్థులు


ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన మిట్స్ విద్యార్థులు

కురబలకోట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తైవాన్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆసియా యూనివర్శిటీ ఇంటర్న్‌షిప్‌కు 10మంది మిట్స్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. మండలంలోని అంగళ్లు సమీప మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనలియర్ సీఎస్‌టీ విద్యార్థులు దాదాపీర్, సాయిమౌనీష్, సీఎస్‌ఈ విభాగానికి చెందిన ప్రణీత, రిషిత, సాయిస్ఫూర్తి, ఏఐ విభాగానికి అమేయశ్రీ, ధనుష్‌రెడ్డి, డేటా సైన్స్ విభాగానికి చెందిన అలీ సయ్యద్, ఇందు ఈశ్వర్‌శివాని, పూజిత ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు వారం రోజుల ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌లో నైపుణ్యాలు. టెక్నిక్స్ ప్రాజెక్ట్‌లో పరిశోధనలు చేశారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. వీరిని కళాశాల కరెస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపాల్ సి.యువరాజ్, డీన్ శ్రీమంత్ బసు, ఇంటర్నేషనల్ రిలేషన్ మేనేజర్ విజయలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

'కిశోరి వికాసం' బాలిక భవిష్యత్తుకు పునాది

తంబళ్లపల్లె, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'కిశోరి వికాసం' బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని సీడీపీఓ నాగవేణి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోరి వికాసంలో అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, కార్యదర్శులకు బాల్య వివాహాల నిర్మూలన, లింగ వివక్ష, అక్షరాస్యత, బాలికావిద్య, వ్యక్తిగత రక్షణ, లింగ సమానత్వంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, ఎంఈఓ త్యాగరాజు, ఏపీఓ అంజినప్ప, ఈఓఆర్డి దిలీప్‌కుమార్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత

బాలికల్లో చైతన్యం రావాలి

పెద్దమండ్యం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల్లో చైతన్యం తీసుకురావాలని ఎంపీడీఓ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాశం శిక్షణలో ఆయన మాట్లాడుతూ కిశోర బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థికంగా మెరుగు పరచమడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. నిర్ణీత వయస్సులో వివాహాలు చేయాలన్నారు. కిశోర బాలికలు మనోధైర్యంగా ముందుకు సాగాలన్నారు. అధికారులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

నిమ్మనపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి సూచించారు. ఎంపీడీఓ కార్యాలమంలో కిశోర బాలికలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సీడీపీఓ సుజాత మాట్లాడుతూ 18ఏళ్లు నిండే వరకు వివాహాలు చేస్తే బాలికలు మానసిక, శారీకంగా దెబ్బ తింటారన్నారు. పౌష్టిక ఆహారం అందించి కిశోర బాలికలు చదువు కునేందుకు ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వం కూడా కిశోర బాలి కలకు అంగన్‌వాడీల ద్వారా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ నారాయణ-2, సూపర్‌వైజర్ భానులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సిబ్బందికి రక్షణ పరికరాలు అందజేత


రక్షణ పరికరాలు అందజేస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విపత్తుల నిర్వహణ, అగ్నిమాపకశాఖ సిబ్బందికి దాతలు రక్షణ పరికరాలను అందజేశారు. బుధవారం స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయం వద్ద జిల్లా ఫైర్ ఆఫీసర్ అనిల్ కుమార్ ద్వారా దాతలు వేణుగోపాల్‌రెడ్డి, ప్రధాన్ అందజేశారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ మదనపల్లె, వాల్మీకిపురం, ములకలచెరువు అగ్నిమాపకశాఖ సిబ్బందికి అవసరమైన 106 గమ్‌బూట్స్, 106 హెల్మెట్లు, 50 కంటి అద్దాలు, 20 టార్చ్‌లైట్లు వితరణగా ఇచ్చారన్నారు. ఫైర్ ఆఫీసర్లు జిశివప్ప, బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

మదనపల్లె టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఓబులేసు తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో పలు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9553202509 సంప్రదించాలని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో కోరారు.

శిక్షణ కెళితే.... కార్యాలయానికి తాళమేనా.?

● మూతపడిన చౌడసముద్రం సచివాలయం

● ఇబ్బందుల్లో గ్రామస్థులు

ములకలచెరువు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహిస్తున్న శిక్షణకు సిబ్బంది వెళ్లడంతో సచివాలయానికి తాళం వేశారు. చౌడసముద్రం సచివాలయం బుధవారం మూతపడింది. దీంతో కార్యాలయానికి వచ్చే గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయం సిబ్బందికి అభివృద్ధిపై శిక్షణ నిర్వహించారు. సచివాలయాల వద్ద ఎవరో ఒకరు అందుబాటులో ఉన్నారు. అయితే చౌడసముద్రంలో మాత్రం ఒక్కరు కూడా అందుబాటులో లేరు. బుధవారం ఉదయం కార్యాలయం తెరిచిన సిబ్బంది అరగంట తరువాత తాళం వేసుకుని వెళ్లారు. దీంతో పనుల కోసం సచివాలయానికి వచ్చిన ప్రజలు అసంతృప్తిగా వెనుదిరిగారు. శిక్షణ ఉంటే సచివాలయం తలుపులు కూడా తెరవరా అని పలువురు గ్రామస్థులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ హరి నారాయణను వివరణ కోరగా వివరాలు తీసుకుంటానన్నారు. సచివాలయం సిబ్బందికి శిక్షణ తరగతులు ఉండడంతో మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి వచ్చారని, ఖచితంగా ఎవరో ఒకరు అందుబాటులో ఉండాలని ముందే చెప్పారన్నారు.


తాళాలు వేసిన దృశ్యం

సంఘమిత్రను తొలగించడంపై నిరసన ధర్నా

బి.కొత్తకోట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలో 14ఏళ్లుగా పనిచేస్తున్న 17వ వీఓ సంఘమిత్ర లక్ష్మీనరసమ్మను తొలగించారంటూ బుధవారం డ్వాక్రా మహిళలు పెద్దసంఖ్యలో రోడ్డెక్కారు. జ్యోతి సర్కిల్ చేరుకుని ప్లకార్డులు చేతపట్టి ధర్నా చేపట్టారు. డ్వాక్రా మహిళలు మాట్లాడుతూ లక్ష్మీనరసమ్మ తొలగింపులో కుట్రకోణం వుందని, తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. 30 సంఘాలున్న 17వ వీఓలో ఎటువంటి ఆరోపణలు, ఫిర్యాదులు లేని వారిని ఎలా తొలగించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ వత్తిడితోనే మరొకరిని తీసుకున్నామని ఏపీఎం రాజేశ్వరిచెప్పారని, ముఖ్య నేత నివాసానికి వెళితే అవమానకరంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెలుగు సంఘాల్లో రాజకీయాలకు తావులేదని అంటుంటే, తంబళ్లపల్లె నియోజకవర్గంలో డ్వాక్రాలో సైతం రాజకీయాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ సంఘమిత్ర కోసం మహిళలు ధర్నా చేయడం చర్చనీయాంశమైంది.

ఉపాధ్యాయులు పనితీరు మెరుగుపరుచుకోవాలి

గుర్రంకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడంతో ఉపాధ్యాయులు పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆర్జేడీ శామ్యూల్ సూచించారు. కంఢ్రిగ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీలో ఆయన ఎస్ఏ-1 బయలాజీ పరీక్ష ప్రశ్నాపత్రాన్ని పరిశీలించారు. ప్రశ్నాపత్రంలోని కొన్ని ప్రశ్నలకు విద్యార్థులను అడిగి సమాధానం రాబట్టారు. విద్యార్థులు సరిగా సమాధానం చెప్పకపోవడంతో ఉపాధ్యాయులపై మండిపడ్డారు. పాఠాలను అర్థవంతంగా బోధించాలని సూచించారు. పాఠశాల్లో ఉపాధ్యాయుల హాజరు, రికార్డులను పరిశీలించారు.

'మేము కొన్న స్థలాలు దేవునిమాన్యం అంటున్నారు'


అధికారులకు అర్జీలు ఇస్తున్న ప్రజలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డుల పరంగా అసలైన ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాం. ఇప్పుడు మా ఇళ్ల స్థలాలు దేవునిమాన్యం భూములంటున్నారు. అధికారులు విచారించి న్యాయం చేయాలని ఎన్‌వీఆర్ లేఅవుట్ ప్రజలు అర్జీలు అందజేశారు. బసినికొండ గ్రామంలో కమ్మపల్లె రెవెన్యూ సదస్సు నిర్వహించారు. లేఅవుట్ ప్రజలు మాట్లాడుతూ ఇరవై ఏళ్ల కిందటే తాము సర్వేనెంబర్ 296లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామన్నారు. కానీ 5.20 ఎకరాల స్థలంలోని తమ ఇళ్ల స్థలాల్లో కొన్నింటిని దేవునిమాన్యం అంటూ అధికారులు రికార్డులు ఎక్కించారని, ఇప్పుడు ఈ స్థలాలు రిజిస్ట్రేషన్ జరగడం లేదన్నారు. దీనిపై రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులు విచారించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై దేవదాయశాఖ అధికారుల కోసం మధ్యాహ్నం వరకు ఎదురుచూసినా రాలేదన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి, తహసీల్దార్ ఖాజాబి, అధికారులు పాల్గొన్నారు.

ఆలయ భూమి సరిహద్దులు సర్వే

రామసముద్రం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్.నడింపల్లె పంచాయతీ బలసముద్రం గ్రామంలో ఉన్న వాళీశ్వరస్వామి భూములను దేవదాయ శాఖ ఈఓ రమణరెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తుల సమక్షంలో బుధవారం సర్వే చేశారు. ఈఓ మాట్లాడుతూ ఆలయ భూమి అన్యాక్రాంతమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ సర్వే చేసి హద్దుగా రాళ్ల నాటామన్నారు. మండలంలోని పలు ఆలయాల భూములు ఆక్రమణకు గురయ్యాయని ఫిర్యాదులు వస్తున్నాయని వీటిపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.


ఆలయ భూమి సరిహద్దులు గుర్తిస్తున్న ఈఓ రమణ

రాష్ట్రీయ స్వరాజ్య అభియాన్‌పై శిక్షణ

రామసముద్రం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వెలుగు కార్యాలయంలో ఎంపీడీఓ భానుప్రసాద్ అధ్యక్షతన బుధవారం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్‌పై శిక్షణ నిర్వహించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం, రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ డీపీఆర్‌సీ చిత్తూరు ఆధ్వర్యంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, సర్వే అసిస్టెంట్లు, ఎనర్జీ అసిస్టెంట్లు, వీఆర్వోలు, వెటర్నరీ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ ఉద్యోగుల శిక్షణలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలాదేవి, మెడికల్ ఆఫీసర్ లీల, మండల ఇంజనీర్ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రియాజ్, ఎంఈఓ హేమలత, ఐసీడీఎస్ శాంతమ్మ, వెలుగు ఏపీఎం సాంబశివ, ఏపీఓ గౌరీశంకర్, సర్పంచ్‌లు రెడ్డెప్పనాయుడు, ఉదయ్‌శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బూర్లపల్లెలో పాడి రైతులకు రుణాలు


పాడి రైతులకు చెక్కులను అందిస్తున్న హెరిటేజ్ ప్రతినిధులు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బూర్లపల్లె గ్రామంలో పాడిరైతులకు హెరిటేజ్ డైరీ ద్వారా రుణాలను మంజూరు చేశారు. బుధవారం బూర్లపల్లెలో హెరిటేజ్ డైరీ సంస్థ ద్వారా పాడి రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. సదస్సుకు సంస్థ ప్రెసిడెంట్ సాంబశివరావు మాట్లాడుతూ బూర్లపల్లె పరిధిలోని పాడి రైతులు అధిక శాతం మంది రైతులు హెరిటేజ్ డైరీకి పాలను అందిస్తున్నారని పాడి రైతుల సంక్షేమం కోసం హెరిటేజ్ సంస్థ ద్వారా పలువరు పాడి రైతులకు విరివిగా రుణాలను అందిస్తున్నామన్నారు. పాడి ఆవుల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాడి రైతులకు వివరించారు. పాడి రైతులకు కావాల్సిన దాణా తక్కువ ధరకే సంస్థ ద్వారా అందిస్తామన్నారు. సంస్థ ద్వారా బుధవారం రూ. 29 లక్షలు రుణాల చెక్కును పాడి రైతులకు అందించారు. పాడి రైతులకు మరిన్ని రుణాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హెరిటేజ్ జోనల్ అధికారులు గోపాల్ కృష్ణ, సర్వోత్తమరెడ్డి, ఆదినారాయణ, సోమశేఖర్, హెరిటేజ్ సిబ్బంది బూర్లపల్లె గ్రామానికి చెందిన పాడి రైతులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వినియోగిస్తే అంధకారమే

కురబలకోట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):విద్యుత్‌ను ఇష్టానుసారంగా వినియోగిస్తే భవిష్యత్ అంధకారమవుతుందని మాజీ ఎస్ఈ సూర్యనారాయణ, ఈఈ గంగాధరం పేర్కొన్నారు. బుధవారం అంగళ్ళు సమీపంలోని జీవీఐసీలో విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు 3కిలోవాట్స్ సోలార్ ప్యానల్స్‌ను ఇంటిపై ఏర్పాటు చేసుకోవాలని దీనికి ప్రభుత్వం నుంచి రూ.70వేల రాయితీని పొందవచ్చన్నారు. 5స్టార్ రేటింగ్ పరికరాలను వినియోగించడంతో విద్యుత్ వాడకాన్ని తగ్గించవచ్చన్నారు. అనంతరం విద్యుత్‌పొదుపుపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీలు హరికుమార్, సురేంద్రనాయక్, ఏఈలు శంకర్‌రెడ్డి, ముజామిల్, గిరిధర్, రమేష్, అజయ్‌బాబు, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

బి.కొత్తకోట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలలో టెన్త్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి తీరాల్సిందేనని డీఈఓ సుబ్రమణ్యం పేర్కొన్నారు. బి.కొత్తకోట మండలం బీరంగి జడ్పీహైస్కూల్, ఏపీ మోడల్‌స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. టెన్త్ విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. బి.కొత్తకోట ఏంఈఓలు ఇద్దరూ అందుబాటులో లేకపోవడంపై ఆరా తీశారు. ఎంఈఓ 2 ట్రైనింగ్‌లో, ఎంఈఓ1 లేక అందుబాటులో లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట పీటీఎం ఎంఈఓ నారాయణ, హెచ్ఎం మునుస్వామి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనూనాయక్ ఉన్నారు.

కోర్టు ఆదేశాలతో మండల సమావేశం వాయిదా

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ సభాభవన్‌లో జరుప తలపెట్టిన మండల సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీలు, కూటమి నేతల నడుమ జరుగుతున్న వార్‌తో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సమావేశాలు జరగడంలేదు. ఇందులో భాగంగానే గురువారం మండల సమావేశం నిర్వహించాలని తలపెట్టారు. కాగా కూటమి నేతలు కోర్టును ఆశ్రయించడంతో సమావేశం వాయిదా పడింది. ఈమేరకు సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు.

భావితరాలకు వెలుగునిద్దాం

ములకలచెరువు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'విద్యుత్‌ను పొదుపు చేద్దాం...భవితరాలకు వెలుగునిద్దామ'ని ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పిలుపు నిచ్చారు. జాతీయ ఇందన పొదుపు వారోత్సవాల్లో భాగంగా బుధవారం ములకలచెరువులో ములకలచెరువు, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈఈ గోవిందరెడ్డి, ఏఈలు రామలక్ష్మణ్, శేషుకుమార్, గిరిధర్ పాల్గొన్నారు.

పలువురిపై కేసులు నమోదు

రామసముద్రం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేసీపల్లె పంచాయతీ యంబాడి గ్రామానికి చెందిన కృష్ణమూర్తి రావుపై స్థలం విషయమై దౌర్జన్యం చేసి కొట్టినందుకు అచ్యుతారావు, మంగమ్మ, శరత్, భరత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. చొక్కాండ్లపల్లె పంచాయతీ పురావాండ్లపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ కుమార్తె అనురాధను భర్త గంగాధర్ అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారన్న అనురాధ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

'పన్నులు చెల్లించండి'

బి.కొత్తకోట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి సహకరించాలని బి.కొత్తకోట రగరపంచాయతీ కమిషనర్ పల్లవి కోరారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బి.కొత్తకోటలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పనులను చేపట్టాలని నిర్ణయించామన్నారు. నగర పంచాయతీ పరిధిలో రూ.2.70 కోట్ల మేర పన్నులు చెల్లించాల్సి వుందని, దీనిపై ఎంత ప్రయత్నించినా స్పందన కరువైందని, ఆదాయం లేకుండా అభివృద్ధి ఎలా సాధ్యం అవుతుందని ఆమె ప్రశ్నించారు. సీటిపన్ను, ఇంటిపన్ను, వీయల్‌టీ పెద్దమొత్తంలో బకాయిలు వున్నాయన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఆక్రమణలను తొలగించామని, త్వరలో గ్రాంటు విడుదల అవుతుందని, డ్రైనేజీలను నిర్మిస్తామని ఆమె తెలిపారు. ఏఓ రమాదేవి పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం సహించేది లేదు : ఎస్ఈ

వాల్మీకిపురం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు సేవలందించే విషయంలో విధులపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని అన్నమయ్య జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్ఈ రమణ హెచ్చరించారు. బుధవారం ఆయన వాల్మీకిపురం విద్యుత్ రెవెన్యూ కార్యాలయం, సెక్షన్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పలు రికార్డులు పరిశీలిస్తూ సిబ్బంది విధుల వివరాలను ఆరా తీశారు. రెవెన్యూ కార్యాలయం సిబ్బంది తీరు మార్చుకుని బాధ్యతగా వ్యవహరించాలని మందలించారు. అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలు ఎప్పటికప్పుడు చెల్లింపులపై దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని, మొండి బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేసి నిబంధనలు మేరకు విద్యుత్ మీటర్లు శాశ్వతంగా తొలగిస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది కూడా పనితీరు మెరుగుపరచుకోకపోతే చర్యలు తప్పవన్నారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్ఈ రమణ